బుధవారం
14-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 54
పేజీలు : 6+8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఫిడెల్ కాస్ట్రో 98వ జయంతి

క్యూబా, బొలీవియా నివాళి

లాపాజ్/హవానా: క్యూబా విప్లవ నేత ఫిడెల్ కాస్ట్రో 98వ జయంతిని పురస్కరించుకొని గువేరా-బొలీవియా మూవ్‌మెంట్ అధ్వర్యంలో చారిత్రక నేతకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫిడెల్ కాస్ట్రో విప్లవస్ఫూర్తి మీద చర్చ నిర్వహించారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం, అంతర్జాతీయ నేతగా ఆయన పాత్రపై చర్చించారు. అదే విధంగా బొలీవియా వైద్యులు, క్యూబా ప్రజలు లాపాజ్‌లోని క్యూబా దౌత్యకార్యాలయం వద్దకు చేరుకొని తమ అభిమాన నేతను స్మరించుకున్నారు.

16న ఎస్ఎస్ఎల్‌వీ ప్రయోగం: ఇస్రో

బెంగళూరు: చిన్న ఉపగ్రహాల ప్రయోగ వాహనం (ఎస్ఎస్ఎల్‌వీ) డెవలప్‌మెంటల్ ఫ్లైట్ ప్రయోగాన్ని ఈనెల 15న కాక 16వ తేదీన చేపట్టనున్నట్లు ఇస్రో ప్రకటించింది. ఎస్ఎస్ఎల్‌వీ లాంచ్ విండో-డీ3/ఈఓఎస్-08 మిషన్ ఉదయం 9.17గంటల నుంచి గంట సేపు ఉంటుందని 'ఎక్స్'లో వెల్లడించింది. ఇది ఈ ఏడాది జరగబోయే మూడవ ప్రయోగమే కాక ఎస్ఎస్ఎల్‌వీ మిషన్‌లో చివరిదిగా తెలిపింది. ఈ ప్రయోగంతో ఎస్ఎస్ఎల్‌వీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పూర్తి

- మిగతా 2 లో

డేరా బాబాకు శిక్ష నుంచి విరామం

చండీగఢ్: ఇద్దరు మహిళలపై లైంగికదాడికి పాల్పడిన కేసులో దోషిగా తేలిన 'డేరా సచ్చా సౌదా' అధ్యక్షుడు గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ అలియాస్ డేరా బాబా మరోసారి జైలు నుంచి బయటకు వచ్చారు. 21 రోజుల పాటు తాత్కాలిక బెయిల్ లభించడంతో ఆయన మంగళవారం ఉదయం 6:30 గంటలకు జైలు నుంచి విడుదలైనట్లు అధికారులు తెలిపారు. ఈ 21 రోజులూ గుర్మీత్ రామ్ సింగ్ ఉత్తరప్రదేశ్‌లోని బర్నావాల్‌లో ఉన్న డేరా ఆశ్రమంలో బస చేస్తారని ఆయన సన్నిహిత వర్గాలు

- మిగతా 2 లో

రేపే అన్న క్యాంటీన్ల ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15న)నాడు అన్న క్యాంటీన్లు ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కృష్ణా జిల్లా గుడివాడలో సీఎం చంద్రబాబునాయుడు అన్నా క్యాంటీన్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు చంద్రబాబు గుడివాడ పర్యటన ఖరారైంది. తొలి విడతగా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 100 క్యాంటీన్లు అందుబాటులోకి తేనుంది. అయితే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక జరిగే ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ కార్యక్రమం

- మిగతా 2 లో

సీబీఐకి కోల్‌కతా వైద్యురాలి కేసు

కలకత్తా హైకోర్టు ఆదేశం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జీ కార్ వైద్య కళాశాల, ఆసుపత్రికి చెందిన మహిళా వైద్యురాలిపై అత్యాచారం, హత్య కేసులో విచారణను సీబీఐకి అప్పగిస్తూ కలకత్తా హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. కేసుకు సంబంధించిన అన్ని పత్రాలను, వివరాలను బుధవారం ఉదయం 10గంటలకల్లా సీబీఐకి అప్పగించాలని పోలీసులను ఆదేశించింది. తమ ఆందోళనను విరమించుకొని విధులకు హాజరు కావాలని వైద్యులకు సూచించింది. వృత్తి ధర్మానికి కట్టుబడాలని హితవు పలికింది. అదే సమయంలో నిరసనకారులతో చర్చలు జరపాలని అధికారులకు హైకోర్టు సూచనలు చేసింది. తొలుత వాదనలు జరిగినప్పుడు వెంటనే హత్య కేసు ఎందుకు నమోదు కాలేదని ప్రధాన న్యాయమూర్తి టీఎస్ శివగ్నానామ్ ప్రశ్నించగా హత్య జరిగినట్లు ఫిర్యాదు రాలేదు కాబట్టే అని ప్రభుత్వ న్యాయవాది బదులిచ్చారు. అసహజ మరణంగా కేసు నమోదు అయిందన్నారు. పోస్టుగ్రాడ్యుయేట్ ట్రైనీ మృతదేహం రోడ్డు పక్కన లభ్యం

- మిగతా 2 లో

వీడిన చిక్కుముడి

తెలంగాణ ఉద్యోగులను రిలీవ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలంగాణ రాష్ట్ర స్థానికతగల ఉద్యోగుల రిలీవ్ విషయంలో ఎట్టకేలకు చిక్కుముడి వీడింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన సమయంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన 122 మంది నాన్‌గెజిటెడ్ ఉద్యోగులను అక్కడికి పంపాలని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలా భాస్కర్ ఉత్తర్వులు జారీజేశారు. ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం తెలంగాణకు చెందిన 122 మంది ఉద్యోగులు రాష్ట్రానికి వచ్చి విధులు నిర్వహిస్తున్నారు.

పదేళ్ల నుంచి ఈ సమస్యకు పరిష్కారం లభించలేదు. నాడు కమలనాథన్ కమిటీ చట్టబద్ధంగా ఆంధ్రాలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను తిరిగి సొంత రాష్ట్రానికి పంపాల్సిందిగా సిఫార్సు చేసింది. దీనిపై సుదీర్ఘకాలంగా టీఎన్జీవో సంఘం డిమాండ్ చేస్తోంది. తమను రిలీవ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని

- మిగతా 2 లో

జోగి మెడకు అగ్రి ఉచ్చు

అగ్రిగోల్డ్ భూముల లావాదేవీల్లో అక్రమాలు

- ఏసీబీ అదుపులో తనయుడు, బాబాయ్
- అధికారుల సోదాలు... కీలక పత్రాల స్వాధీనం
- మరో కేసులో మాజీమంత్రికి పోలీసుల నోటీసు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అగ్రిగోల్డ్ భూముల అక్రమాల వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. విజయవాడ రూరల్ పరిధిలోని అంబాపురం దగ్గర అగ్రిగోల్డ్ భూముల క్రయ విక్రయాల వ్యవహారంలో కీలక నిందితుడుగా గుర్తించిన ఏసీబీ అధికారులు వైసీపీ నేత, మాజీమంత్రి జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్, బాబాయ్ జోగి వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో ఉండవల్లిలోని చంద్రబాబు ఇంటికి ప్రదర్శనగా వెళ్లిన ఘటనకు సంబంధించి నమోదైన కేసులో విచారణకు రావాలని జోగి రమేశ్‌కు తాడేపల్లి పోలీసులు నోటీసులు జారీజేశారు. ఈ రెండు సంఘటనల్లో నమోదైన కేసులు జోగి రమేశ్‌ను ఉక్కిరిబిక్కిరిచేశాయి.

అగ్రిగోల్డ్ భూములకు సంబంధించి అక్రమ లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలపై మంగళవారం తెల్లవారుజామున ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని జోగి రమేశ్ నివాసానికి 15మంది ఏసీబీ అధికారుల బృందం చేరుకుని సోదాలు చేపట్టారు. వివిధ కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమయంలో జోగి రమేశ్ ఇంటికి భారీగా వైసీపీ శ్రేణులు తరలివచ్చారు. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలోనే జోగి రమేశ్ కుటుంబ సభ్యులపై ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. భూముల రిజిస్ట్రేషన్లలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇందుకు సంబంధించిన రికార్డులు, పత్రాలను ఏసీబీ అధికారులు పరిశీలించారు. జోగి రమేశ్

- మిగతా 2 లో

విలువలతో నాణ్యమైన విద్య

- 'ప్రైవేటు'కు దీటుగా ప్రభుత్వ బడులు
- త్వరలో నైపుణ్య గణనపై సర్వే
- విద్యాశాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : విద్యాశాఖలో సమూల మార్పులు జరగాలని, విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యాశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యపై ప్రభుత్వం రూ.32 వేల కోట్లు ఖర్చుచేస్తోందని... క్షేత్రస్థాయిలో దీనికి తగ్గ ఫలితాలు కనిపించాలన్నారు. ముఖ్యంగా మారుతున్న కాలానికి అగుణంగా, భవిష్యత్ అవసరాలను దష్టిలో పెట్టుకుని సిలబస్ లో మార్పులు చేయాలని, ఇందుకోసం విద్యా రంగ నిపుణులు, మేధావులు, ఆయా రంగాల ప్రముఖులతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని సీఎం సూచించారు. సచివాలయంలో మంగళవారం సీఎం విద్యాశాఖపై సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వచ్చే 10-20 ఏళ్లకు ఏమి అవసరమో గుర్తించి బోధిస్తే మంచి ఫలితాలు ఉంటాయని, ప్రచార ఆర్భాటం కాకుండా ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టాలని సీఎం అన్నారు. విద్య ప్రతి ఒక్కరి హక్కు...బడి ఈడు పిల్లలు బయట ఉండడానికి వీల్లేదని...ఈ విషయంలో కఠినంగా ఉండాలని సీఎం ఆదేశించారు. ప్రైవేటు విద్యా సంస్థలతో ప్రభుత్వ స్కూళ్లు

- మిగతా 2 లో

రాజదండం స్థానంలో రాజ్యాంగం

- రాచరిక చిహ్నాలు ప్రజల జీవితాల్లోకి ప్రవేశించకూడదు
- మెగసెసె అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్ డిమాండ్

విశాలాంధ్ర- విజయవాడ: ప్రజాస్వామ్య దేశంలో 'సింగోల్' వంటి రాచరిక చిహ్నాలు ప్రజల జీవితాల్లోకి ప్రవేశించకూడదని రామన్ మెగసెసె అవార్డు గ్రహీత, సఫాయి కర్మచారీ ఆందోళన్ నేత బెజవాడ విల్సన్ అన్నారు. పార్లమెంట్‌లో రాజదండం స్థానంలో రాజ్యాంగం ప్రతిష్టించాలన్న డిమాండ్‌తో దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) అధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ, ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ కమిటీ కన్వీనర్ జల్లి విల్సన్ అధ్యక్షతన విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఈ సదస్సు జరిగింది. బెజవాడ విల్సన్ మాట్లాడుతూ దేశాన్ని తల్లిగా చెబుతూ పాలకుల తప్పులు ఎత్తిచూపి.... ఎదిరించే వారి నోరు నొక్కేసే విధానం దేశంలో అమలవుతోందన్నారు. ప్రస్తుత పాలకులకు స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదన్నారు. పార్లమెంట్‌లో ఏది చేయకూడదో అది చేస్తున్నారని, ప్రజలను మోసం చేయడానికి బయట పార్లమెంట్‌కు మొక్కుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ యాధృచ్ఛికంగా ఏదీ చేయరని, ప్రతిదాని వెనుక వ్యూహం ఉంటుందన్నారు. అమెరికా అధ్యక్షుడు ఢిల్లీ కాకుండా అహ్మదాబాద్ వెళ్లారని, అక్కడ వ్యాపార లావాదేవీలు పూర్తిచేసుకుని ఢిల్లీ వచ్చారన్నారు. అమెరికా అధ్యక్షుడి పర్యటన వేళ పేదలు నివాసం ఉండే ప్రాంతాలు కనబడకుండా గోడలు నిర్మించారని గుర్తు చేశారు. గుజరాత్ మోడల్ అంటే చంపే వారు... చంపబడే వారుగా చీల్చటమేనన్నారు. నరహంతకులు రాజ్యమేలుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కులం, జాతి అనేవి అవమానకరం, దాష్టీకమైనవని చెప్పారు. విస్మరణకు గురైన అంశాలను ప్రజలకు వివరించేది కమ్యూనిస్టులేనని బెజవాడ విల్సన్ అన్నారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తనను మొదటిసారి పార్లమెంట్‌లోకి తీసుకెళ్లారని గుర్తు చేసుకున్నారు. అంబానీ తన దర్పం

- మిగతా 2 లో

కాంగ్రెస్‌కు పట్టువిడుపులు అవసరం: రాజా

న్యూఢిల్లీ: కలిసి ముందుకెళ్లే సమయంలో మిత్రపక్షాల విషయంలో సానుకూలంగా వ్యవహరించడం కాంగ్రెస్‌కు అవసరమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా నొక్కిచెప్పారు. మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా రాష్ట్రాల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఆయన మంగళవారం ఈ వ్యాఖ్యలు చేశారు. సార్వత్రిక ఎన్నికలప్పుడు కాంగ్రెస్‌కు పట్టు విడుపులు ఉండివుంటే ఫలితాలు వేరుగా ఉండేవన్నారు. మంతనాలు జరిపినా లెఫ్ట్‌కు సముచిత స్థానాలు లభించలేదని తెలిపారు. కేవలం రెండు సీట్లే దక్కాయన్నారు. తమిళనాడు, బీహార్‌లో డీఎంకే, ఆర్జేడీకి స్థానికంగా మంచి పట్టు ఉన్నప్పటికీ లెఫ్ట్‌కు తగు ప్రాతినిధ్యం లభించిందని, దేశంలో మరెక్కడా ఆ పరిస్థితి లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సీపీఐకి ఒక సీటు, రాజస్థాన్‌లో సీపీఎంకు ఒక స్థానమే కేటాయించడాన్ని రాజా గుర్తుచేశారు. పట్టు విడుపులు అలవర్చుకోవడం ద్వారా సానుకూల పరిణామాలు సాధ్యమని కాంగ్రెస్‌కు హితవు పలికారు. లెఫ్ట్ ఎప్పుడూ

- మిగతా 2 లో

22న దేశవ్యాప్త ఆందోళన

కాంగ్రెస్ పిలుపు

సెబీ అధినేత్రి రాజీనామా, అదానీపై జేపీసీ విచారణకు డిమాండ్

న్యూఢిల్లీ: సెబీ చైర్‌పర్సన్ మాధవి బచ్, ఆమె భర్తకు అదానీ సంస్థలో వాటాలు ఉన్నట్లు హిండెన్‌బర్గ్ రీసెర్చ్ విడుదల చేసిన నివేదిక రాజకీయ దుమారం రేపింది. దీంతో సెబీ అధినేత్రి రాజీనామా, అదానీ వ్యవహారంలో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ కోసం కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఇదే డిమాండ్‌తో ఈనెల 22న దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చింది. ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రశాఖాధ్యక్షులతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం జరిపిన సమావేశం అనంతరం దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తూ అధికారిక ప్రకటనను కాంగ్రెస్ విడుదల చేసింది. సమావేశంలో అసెంబ్లీ ఎన్నికలు, సంస్థాగత వ్యవహారాలు, జాతీయ అంశాలు, ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. అనంతరం ఖర్గే 'ఎక్స్'లో స్పందిస్తూ ఈనెల 22న దేశవ్యాప్త ఆందోళనలకు సిద్ధం కావాలని

- మిగతా 2 లో

యుద్ధ ప్రాతిపదికన తుంగభద్ర గేటు పనులు

డ్యామ్‌ను పరిశీలించిన మంత్రులు పయ్యావుల, రామానాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : కర్నాటకలోని హోస్పేట వద్ద ఉన్న తుంగభద్ర డ్యామ్‌ను మంగళవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా డ్యామ్‌కు చెందిన కొట్టుకుపోయిన 19వ నంబరు గేటును పరిశీలించి సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి పయ్యావుల మాట్లాడుతూ నాలుగైదు కోట్ల రూపాయలు ఖర్చు పెడితే డ్యామ్ గేటు సిద్ధం చేసే అవకాశం ఉందని, అయితే నష్టం వేల కోట్ల రూపాయలకు వెళుతోందన్నారు. డ్యామ్ గేటు నీటి ప్రవాహం ఉండగానే దించాలా, ఆగిన తర్వాత దించాలా అనే సాంకేతిక సమస్యలు ఉన్నాయని, నిపుణులు నిర్ణయం తీసుకుంటారన్నారు. ఈ విషయమై మన ఇంజనీర్లు... దేశంలోని ఇంజనీర్లందరినీ సంప్రదిస్తున్నారని తెలిపారు. నిపుణులు ఏం చెప్పినా దానికి సహకరించేందుకు ఆంధ్ర, కర్నాటక ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రిటైర్డ్ అధికారి

- మిగతా 2 లో

వైద్య కళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ కోటాపై స్టే

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైద్య కళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ కోటా సీట్ల కేటాయింపు జీవో నిలిపివేస్తూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. జీవోను సవాల్ చేస్తూ మెడికల్ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. మెడికల్ సీట్లు పెంచి ఈడబ్ల్యూఎస్ కింద సీట్లు ఇవ్వాలని పిటిషనర్ తరపు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నే చెప్పానా? బాబు అంటేనే ప్రైవేటు..! ప్రైవేటు అంటేనే బాబు!

అమెరికాకు శక్తిమంతమైన అధ్యక్షుడు కావాలి

డెమొక్రాట్లలో తిరుగుబాటుతోనే బైడెన్ ఔట్: మస్క్‌తో ఇంటర్వ్యూలో ట్రంప్

వాషింగ్టన్: అమెరికాకు శక్తిమంతమైన అధ్యక్షుడు కావాలని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. డెమొక్రాట్లతో తిరుగుబాటు రావడం వల్లనే జో బైడెన్ అధ్యక్ష రేసు నుంచి వైదొలగాల్సి వచ్చిందని తెలిపారు. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈసారి తిరిగి అధ్యక్ష పీఠాన్ని అధిష్టించాలని సంకల్పించారు. ఇదే క్రమంలో ఆయన స్పేస్ ఎక్స్ అధినేత ఎలన్ మస్క్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూకు బహుళ ప్రచారం లభించింది. అధ్యక్ష పదవికి పోటీదారులుగా బైడెన్‌తో జరిపిన చర్చలు (డిబేట్) తాను పాల్గొన్న గొప్ప చర్చల్లో ఒకటిగా ట్రంప్ అభిప్రాయపడ్డారు. బైడెన్ తడబాటు వల్ల ఆయన తన అభ్యర్థిత్వాన్ని కోల్పోయారన్నారు. 'జో బైడెన్‌తో డిబేట్ నేను పాల్గొన్న గొప్ప చర్చల్లో ఒకటి. అందులో బైడెన్‌ను ఘోరంగా ఓడించా. ఫలితంగా ఆయనను ఆ పార్టీ అధ్యక్ష బరి

నుంచి తొలగించింది. డెమొక్రాటిక్ పార్టీలో తిరుగుబాటు రావడం వల్లనే బైడెన్ తప్పుకోక తప్పలేదు' అని స్పేస్‌ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ట్రంప్ అన్నారు. రష్యా, చైనా, ఉత్తర కొరియా అధినేతలు వ్లాదిమిర్ పుతిన్, జిన్‌పింగ్, కిమ్ జోంగ్ ఉన్ గురించీ మాట్లాడారు. అధినేతలు తమ దేశ ప్రేమికులని ట్రంప్ అన్నారు. అయితే వారి ప్రేమ భిన్నమైనదిగా వర్ణించారు. ఇటువంటి నాయకులను ఎదిరించాలంటే అమెరికాకు శక్తిమంతమైన అధ్యక్షుడు అవసరమని అభిప్రాయపడ్డారు. బైడెన్ అధ్యక్షుడు కాకపోతేగనుక ఉక్రెయిన్‌పై రష్యా దాడి జరిగేది కాదని మాజీ అధ్యక్షుడు అన్నారు. పుతిన్ తనను చాలా గౌరవిస్తారని, ఆయనతో అనేకసార్లు మాట్లాడానని, ఉక్రెయిన్ గురించీ చర్చించారని ట్రంప్ వెల్లడించారు. అదే సమయంలో పెన్సిల్వేనియాలో నిర్వహించిన ప్రచార సభలో తనపై హత్యాయత్నాన్ని ప్రస్తావించారు. త్రుటిలో ప్రాణాలతో బయట పడ్డానని, బుల్లెట్ చెవికి తగిలిందని, అదే చివరి క్షణంగా తోచిందని, బుల్లెట్ దూసుకెళ్లడం తెలిసిందని ఆయన చెప్పారు.

షేక్ హసీనాపై హత్య కేసు

విచారణకు బంగ్లాదేశ్ కోర్టు ఆదేశాలు

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై హత్య కేసులో విచారణకు అక్కడి కోర్టు ఆదేశించింది. జులై 19న పోలీసుల కాల్పుల్లో చనిపోయిన అబు సయ్యద్ తరపున ఆయన శ్రేయోభిలాషి ఈ కేసు దాఖలు చేశారు. నిందితుల్లో అవామీ లీగ్ ప్రధాన కార్యదర్శి ఒబైదుల్ ఖాదర్, హోంశాఖ మాజీ మంత్రి అసదుజ్జమన్ ఖాన్ కమల్, మాజీ ఐజీ చౌదరి అబ్దుల్లా అల్ మమూన్ సహా పోలీసు ఉన్నతాధికారులు, ప్రభుత్వ అధికారులు కలిపి మొత్తం ఏడుగురున్నారు. ప్రధానిగా రాజీనామా, భారత్ పలాయనం తర్వాత షేక్ హసీనాపై ఈ కేసు నమోదైంది.

మాకు ఎలాంటి సంబంధం లేదు

షేక్ హసీనా ఆరోపణలను తోసిపుచ్చిన అమెరికా

వాషింగ్టన్: బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నట్లు వచ్చిన ఆరోపణలను అమెరికా తోసిపుచ్చింది. బంగ్లాదేశ్ సంక్షోభంతో తమకు ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరీనే జీన్ పెర్రే ఒక ప్రకటన విడుదల చేశారు. బంగ్లాదేశ్ వ్యవహారాల్లో తమ జోక్యం ఏమాత్రం లేదని అందులో స్పష్టంచేశారు. అమెరికా గురించి వచ్చేవి అవాస్తవ ప్రకటనలుగా తెలిపారు. బంగ్లాదేశ్ అల్లర్ల వెనుక అమెరికా హస్తం ఉన్నదని, అగ్రరాజ్యానికి తలొగ్గని కారణంగానే అధికారాన్ని కోల్పోయినట్లు ఆదేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఆరోపించారు. సెయింట్ మార్టిన్ దీవిపాన్ని అప్పగించాలని అమెరికా ఒత్తిడి తెచ్చినట్లు తెలిపారు. దీంతో అమెరికా స్పందించింది. అయితే తన తల్లి ఇటువంటి ప్రకటనే చేయలేదని షేక్ హసీనా తనయుడు సజీబ్ వజేద్ ఒక ప్రకటన చేశారు. కాగా, ఈనెల 5న నిరసనలు మిన్నంటిన క్రమంలో షేక్ హసీనా బంగ్లాదేశ్‌ను వీడిన విషయం తెలిసిందే.

సీబీఐకి కోల్‌కతా వైద్యురాలి కేసు

(మొదటిపేజీ తరువాయి)

కాలేదు కాబట్టి ఆ ఆసుపత్రి ప్రిన్సిపల్ లేక సూపరింటెండెంట్ ఫిర్యాదు చేయాలి కదా అంటూ సీజే నేతృత్వ డివిజన్ బెంచ్ వ్యాఖ్యానించింది. హత్య జరిగిన తీరు నేపథ్యంలో జూనియర్ వైద్యుల ఆందోళన, ఆగ్రహం సమర్థనీయమేనని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. కాగా, ఆర్‌జీ కార్ ఆసుపత్రి సెమినార్ హాలులో వైద్యురాలి మృతదేహం లభ్యమైంది. ఆమెపై అత్యాచారం, హత్య అక్కడే జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో ఓ వలంటీరు శనివారం అరెస్టయ్యారు.

16న ఎస్ఎస్ఎల్‌వీ ప్రయోగం

(మొదటిపేజీ తరువాయి)

అవుతుందని వెల్లడించింది. ఆపై భారత పరిశ్రమ, ఎన్ఎస్ఐఎల్‌లో ఆపరేషనల్ మిషన్లకు మార్గం సుగమం కానున్నట్లు ఇస్రో పేర్కొంది. ఈఓఎస్-08 ఉపగ్రహం బరువు 175.5 కేజీలు కాగా ఈ మిషన్‌కు ఆత్యాధునిక సాంకేతికత కీలకమని వెల్లడించింది.

డేరా బాబాకు శిక్ష నుంచి విరామం

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించాయి. కాగా డేరాబాబా విడుదలను వ్యతిరేకిస్తూ శిరోమణి గురుద్వారా పర్బంధక్ కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌ను పంజాబ్-హర్యానా హైకోర్టు ఇటీవలే కొట్టివేసిన విషయం తెలిసిందే. ఆ పరిణామం జరిగిన రోజుల వ్యవధిలోనే ఆయనకు తాత్కాలిక బెయిల్ లభించింది. తనకు సంవత్సర కాలంలో 41 రోజుల ఫెరోల్ ఉందని, దాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని పంజాబ్-హర్యానా హైకోర్టు తలుపుతట్టాడు. 20 రోజుల పెరోల్, 21 రోజుల తాత్కాలిక బెయిల్‌పై బయటకు వచ్చేందుకు అర్హత ఉందని పేర్కొన్నాడు. అయితే, కోర్టు అనుమతి లేకుండా భవిష్యత్‌లో డేరా చీఫ్‌కు పెరోల్ దరఖాస్తును పరిగణలోకి తీసుకోవద్దని ఫిబ్రవరి 29న హైకోర్టు డివిజన్ బెంచ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఫిబ్రవరి 29 నాటి ఉత్తర్వులపై స్టే ఎత్తివేయాలని కోరుతూ డేరా చీఫ్ హైకోర్టును ఆశ్రయించాడు. గతంలో ఇచ్చిన ఉత్తర్వులు తన హక్కులకు విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం... ఎలాంటి పక్షపాతం, రాగద్వేషాలు లేని సమర్థ అధికారి ఈ అభ్యర్థనను పరిశీలించాలని ఆగస్టు 9న కోర్టు ఆదేశాలు ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు పరిశీలన అనంతరం అతడికి పెరోల్ దక్కింది.

రేపే అన్న క్యాంటీన్ల ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

వాయిదా పడింది. మిగతా జిల్లాల్లో ఎంపిక చేసిన 33 పురపాలక, నగర పాలక సంస్థల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎక్కడెక్కడ క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలన్న విషయంలో పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. 16వ తేదీ నుంచి ఈ క్యాంటీన్లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయి. తొలి విడతలో రాజధాని ప్రాంతం గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో అత్యధికంగా 14 చొప్పున, నెల్లూరు, పల్నాడు జిల్లాల్లో 9 చొప్పున, పశ్చిమ గోదావరి, కాకినాడ జిల్లాల్లో 8 చొప్పున, ప్రకాశం, కృష్ణా, ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల్లో 5 చొప్పున, బాపట్ల జిల్లాలో 4, శ్రీకాకుళం, చిత్తూరు జిల్లాల్లో మూడేసి, విజయనగరం, కోనసీమ, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో రెండు చొప్పున అన్న క్యాంటీన్లు ప్రారంభం కానున్నాయి.

వీడిన చిక్కుముడి

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ఉద్యోగులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో భేటీ నిర్వహించి... వివిధ సమస్యలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న వాటిని మినహాయించి, రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలు పరిష్కరించుకోవాలని ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఏపీలో పనిచేస్తున్న 122 మంది తెలంగాణ ఉద్యోగులను తమ రాష్ట్రానికి పంపాలని తెలంగాణ ప్రభుత్వం అభ్యర్థించింది. దీనిపై సానుకూలంగా ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రిలీవ్ అయ్యే వారంతా తమ కేడర్ చివరి ర్యాంకులోనే అక్కడ విధుల్లో చేరాల్సి ఉంది. ఈ బదిలీల సమస్య పరిష్కారం కోసం ఏపీ జేఏసీ అమరావతి అధ్వర్యంలో తెలంగాణ ఎన్జీవో నాయకత్వాన్ని కలుపుకుని నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు వినతులు అందజేశారు. వాటిపై స్పందించి ఉత్తర్వులిచ్చిన ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు ధన్యవాదాలు తెలిపారు.

విలువలతో నాణ్యమైన విద్య

(మొదటిపేజీ తరువాయి)

పోటీ పడాలని, ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యార్థుల హాజరు 100 శాతం ఉండాలని, డిగ్రీ వరకు వరకు అది కొనసాగేలా పర్యవేక్షించాలన్నారు. ప్రైవేటు స్కూళ్ల తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో కూడా తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. కర్నూలు జిల్లాలో వలస కార్మికుల పిల్లలు స్కూళ్లకు దూరం అవుతున్నారని అధికారులు చెప్పగా, వారిని రెసిడెన్షియల్ స్కూళ్లలో చేర్పించి విద్యను అందించాలని సూచించారు. స్కూళ్లలో ఇంగ్లీష్ తో పాటు మాతృభాష తెలుగుకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం తెచ్చి ప్రోత్సహించింది గత తెలుగుదేశం ప్రభుత్వమేనని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలకు రేటింగ్ కూడా ఇవ్వాలని, త్వరలో జన్మభూమి 2.0 కార్యక్రమం ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆయా గ్రామాల్లో ఎవరైనా పాఠశాలలు అభివృద్ధి చేయడానికి ముందుకు వస్తే వారిని ప్రోత్సహించాలని చెప్పారు. 2014-19 మధ్య విద్యావ్యవస్థలో ప్రధాన సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఏటా ప్రతిభా అవార్డులు అందించామని... గత ప్రభుత్వం రద్దు చేసిన ఈ కార్యక్రమాన్ని మళ్లీ పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ఇదొక స్ఫూర్తిగా ఉంటుందని సీఎం చెప్పారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ పై సీఎం సమీక్ష చేశారు. రాష్ట్రంలో 1.60 కోట్ల కుటుంబాల్లో 3.54 కోట్ల మంది పనిచేసే వయసు ఉన్న ప్రజలు ఉన్నారని, వారి నైపుణ్యాన్ని గణన చేయడం కోసం 40 వేల మంది ఎన్యుమరేటర్లు అవసరం ఉంటుందని అధికారులు సీఎంకు వివరించారు. బేసిక్ స్కిల్ ప్రొఫైల్, డొమైన్ స్కిల్స్, క్రాస్ ఫంక్షనల్ స్కిల్స్ పై గణన చేయాలని... డోర్ టు డోర్, మీ సేవ కేంద్రాలు, విద్యా సంస్థలు, మొబైల్ యాప్ వంటి 4 విధానాల ద్వారా స్కిల్ సెన్సస్ చేయవచ్చని ప్రతిపాదించారు. దీనిపై పారిశ్రామిక రంగ ప్రతినిధులతో కూడా సంప్రదించి నైపుణ్య గణన కార్యక్రమాన్ని చేపట్టాలని సీఎం సూచించారు. మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖలో తీసుకువచ్చిన నూతన విధానాలు, సంస్కరణల గురించి ముఖ్యమంత్రికి వివరించారు. ఒక క్లాసుకు ఒక టీచర్ అనే విధానం అమలుచేస్తున్నామని తెలిపారు. టీచర్లపై అనవసరపు ఒత్తిడి తేవడం వల్ల ఉపయోగం ఉండదని, అందుకే ఉపాధ్యాయులపై యాప్ ల భారం తగ్గించామని వివరించారు.

బంగ్లాదేశ్ ప్రభుత్వ సలహాదారుగా ఫరూక్

ఢాకా: బంగ్లాదేశ్ ఆపద్ధర్మ ప్రభుత్వ సలహాదారునిగా ఫరూక్ ఏ ఆజం మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. సలహాదారులుగా డాక్టర్ బిధన్ రంజన్ రాయ్ పొద్దర్, సుప్రదీప్ చక్మా కూబా ప్రమాణాలు చేశారు. కార్యాలయ బాధ్యతలనూ చేపట్టారు. అధ్యక్షుడు షహబుద్దీన్ మంగళవారం ఉదయం 11 గంటలప్పుడు బంగాభవన్‌లో వీరితో ప్రమాణం చేయించారు.

ఆదివారం రాత్రి అమెరికా నుంచి తిరిగివచ్చిన ఫరూక్ ఏ ఆజం కొత్త బాధ్యతలు స్వీకరించారు. ఆయన నేవల్ కమాండర్, స్వాతంత్య్ర సమరయోధుడు, బీర్ ప్రతీక్ పురస్కార గ్రహీత.

నలుగురు జడ్జీల ప్రమాణం

బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు అప్పీలేట్ డివిజన్ న్యాయమూర్తులుగా నలుగురు జడ్జిలు కొత్తగా నియమితులయ్యారు. వీరి ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. జస్టిస్ జుబేర్ రెహమాన్ చౌదరి, జస్టిస్ సయ్యద్ జియాఉల్ కరీం, జస్టిస్ రేజల్ హక్, జస్టిస్ ఇందాదుల్ హక్ సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తులుగా పదోన్నతి పొందినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి సయ్యద్ రిఫత్ అహ్మద్ సమక్షంలో కొత్త జడ్జిలు తమ పదవీ బాధ్యతలు చేపట్టారు. బంగ్లాదేశ్ ప్రధాన న్యాయమూర్తిగా రిఫత్ అహ్మద్ శనివారం నియమితులైన విషయం విదితమే.

జోగి మెడకు 'అగ్రి' ఉచ్చు

(మొదటిపేజీ తరువాయి)

ఇంటిని పూర్తిగా స్వాధీనంలోకి తీసుకుని ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు.

అంబాపురం భూముల రెవెన్యూ రికార్డుల తారుమారు

విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న అగ్రిగోల్డ్ భూములను జోగి రమేశ్ తనయుడు జోగి రాజీవ్, బాబాయ్ జోగి వెంకటేశ్వరరావు కొనుగోలు చేశారు. రెవెన్యూ, గ్రామ అధికారుల సహకారంతో ఆ భూమి రికార్డులను తారుమారు చేసి సర్వే నంబర్లు మార్చారని ఏసీబీ అధికారులు వెల్లడిస్తున్నారు. రాజీవ్ పేరుతో దస్తావేజులు సృష్టించి, అదే భూమిని పగిడిపాటి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులకు విక్రయించారని గుర్తించారు. దీనిపై పోలీసులకు అవ్వా శేష నారాయణ ఫిర్యాదు చేయగా... ఒక నివేదిక తయారుచేసి విజయవాడ సీపీకి అందజేశారు. అదే నివేదికను ఏసీబీ అధికారులకు ఇచ్చారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశాల మేరకు ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి, జోగి రమేశ్ తనయుడు జోగి రాజీవ్, బాబాయ్ జోగి వెంకటేశ్వరరావు పాత్రపై ఆరా తీశారు. అగ్రిగోల్డ్ భూ వివాదంపై గత నెలలోనే డీజీపీ విచారణకు ఆదేశించారు. డీజీపీ ఆదేశాలతోనే ఏజీబీ అధికారులు రంగంలోకి దిగారు. ఏసీబీ అధికారుల తనిఖీల అనంతరం జోగి రమేశ్ తనయుడు జోగి రాజీవ్‌ను అదుపులోకి తీసుకుని విజయవాడ ఏసీబీ కార్యాలయానికి తరలించారు. ఈ వ్యవహారంలో జోగి రాజీవ్, జోగి వెంకటేశ్వరరావు పాత్రపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఐదుగురి పేర్లు ఉన్నాయని, మరికొన్ని పేర్లు వచ్చే అవకాశముందని ఏసీబీ అధికారులు తెలుపుతున్నారు. ఏ1గా రాజీవ్‌ను, ఏ2గా జోగి వెంకటేశ్వరరావు పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చి, వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మరికొందరి పేర్లను ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా ఏసీబీ పేర్కొంది. వీళ్లందరినీ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. జోగి రాజీవ్, జోగి వెంకటేశ్వరరావును గొల్లపూడి ఏసీబీ కార్యాలయానికి తీసుకొచ్చి విచారిస్తున్నారు. గతంలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఇంటి దగ్గర నిరసనకు దిగిన కేసులో జోగి రమేశ్ నిందితుడిగా ఉన్నారు. దీనిపై విచారణకు హాజరుకావాలని పోలీసులు ఆయనకు నోటీసులు జారీచేశారు. దీంతో జోగి రమేశ్‌ను కూడా అరెస్టు చేస్తారన్న చర్చ సాగుతోంది.

అందరిలాగానే భూముల కొనుగోలు: మాజీ మంత్రి జోగి రమేశ్

అగ్రి గోల్డ్ భూములు ఇప్పటికే అటాచ్‌లో ఉన్నాయనీ, అటాచ్‌మెంట్‌లో ఉన్న భూమిని ఎవరైనా కొంటారా అని మాజీ మంత్రి జోగి రమేశ్ ప్రశ్నించారు. కక్ష ఉంటే తనపై తీర్చుకోవాలి కానీ, నా కుటుంబాన్ని టార్గెట్ చేస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది బీసీలపై దాడి అని అభివర్ణించారు. తప్పు చేస్తే నడిరోడ్డుపై ఉరేసుకుంటానని జోగి రమేశ్ సవాల్ చేశారు. నాడు చంద్రబాబు ఇంటికి నిరసన తెలిపేందుకే వెళ్లానని, దాడికి కాదన్నారు. ఈ విషయాన్ని టీడీపీ నేతలు గుర్తెరగాలన్నారు. ఏమన్నా ఉంటే తనపై కక్ష తీర్చుకోవాలేగాని, విదేశాల్లో ఎంఎస్ చదివి వచ్చిన తన కుమారుడిని అన్యాయంగా కేసులో ఇరికిస్తారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆయన మండిపడ్డారు.

తన తండ్రిపై కక్షతోనే నన్ను అరెస్టు చేశారు: జోగి రాజీవ్

అగ్రి గోల్డ్ భూముల క్రయ విక్రయాల్లో ఎలాంటి గోల్ మాల్ జరగలేదని, తన తండ్రిపై కక్షతోనే ప్రభుత్వం తనను అరెస్టు చేయించిందని జోగి రాజీవ్ అన్నారు. అందరూ కొనుగోలు చేసినట్లుగానే తామూ భూమి కొనుగోలు చేశామని చెప్పారు. అగ్రి గోల్డ్ కేసును చట్టపరంగాను, న్యాయపరంగాను ఎదుర్కొంటామని చెప్పారు. తమపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు.

రాజదండం స్థానంలో రాజ్యాంగం

(మొదటిపేజీ తరువాయి)

ప్రదర్శించటానికి కుమారుడి వివాహాన్ని వేదికగా చేసుకున్నారని చెప్పారు. 1993లో చేతులతో మలమూత్రాలు తీయకూడదనే చట్టం వచ్చిందని, అయినా ఈ చట్టానికి సంబంధించి నేటికీ ఒక్క కేసు నమోదు కాలేదన్నారు. మ్యాన్‌హోల్స్, మురికి గుంతలలో పడి అనేక మంది చనిపోతున్నారని చెప్పారు. మ్యాన్‌హోల్‌లో పడి చనిపోయిన వారి లెక్కలు ప్రభుత్వం వద్ద లేవుగానీ... అడవుల్లో ఉన్న పులుల సంఖ్య మాత్రం ఉందని ఎద్దేవా చేశారు. చంద్రమండలం, సూర్యమండలానికి వెళ్లే ఉపగ్రహాలను తయారు చేస్తారుగానీ... మ్యాన్‌హోల్స్ శుభ్రం చేసే యంత్రాలు కనిపెట్టరని పేర్కొన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఆర్థిక విధానాలు కార్పొరేట్‌లకు అనుకూలంగా ఉండాలనే పద్ధతిలో మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదన్నారు. మనుస్మృతి ఆధారంగా రాజ్యాంగం ఉండాలని, వ్యవస్థల్ని తమ గుప్పెట్లో పెట్టుకోవాలని చూస్తున్నదని పేర్కొన్నారు. కేంద్రంలో ముఖ్యమైన మంత్రిపదవులన్నీ బీజేపీ వద్దనే ఉన్నాయన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టి సోషల్ ఇంజనీరింగ్ ద్వారా అధికారం చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవటం కోసం అందరం కలిసి ఐక్యంగా పోరాడాల్సి ఉందన్నారు. అన్ని జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి ఒకే వేదికగా పోరాటం చేయాలన్నారు. సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రాచరికానికి తావులేదన్నారు. ముస్లిం పెద్దలు దానధర్మాలుగా ఇచ్చిన భూములను సక్రమంగా వినియోగించేందుకు ఉద్దేశించిందే వక్ఫ్ ఆస్తుల చట్టమని వివరించారు. వక్ఫ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవటాన్ని ఖండించాలని కోరారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీ నేతను నీ కులం ఏమిటి అని మరో ఎంపీ అడిగే పరిస్థితి వచ్చిందన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో అధ్యక్ష తరహా పాలన తీసుకురావటానికి ప్రయత్నిస్తున్నదన్నారు. బీజేపీని బలపర్చేవారిని కూడా వ్యతిరేకించాలని కోరారు. మధ్య యుగాల నాటి ఆచార వ్యవహారాలను ప్రజలపై రుద్దాలని మోదీ ప్రయత్నిస్తున్నారని చెప్పారు. రాజదండం స్థానంలో రాజ్యాంగాన్ని ఉంచాలని డీహెచ్‌పీఎస్ చేస్తున్న పోరాటం అభినందనీయమన్నారు.

జల్లి విల్సన్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవటం, సక్రమంగా అమలు జరిపించుకోవటం ప్రజల బాధ్యత అన్నారు. రాజ్యాంగం ద్వారా సామాజిక న్యాయం సాధించాలన్నారు. అందుకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడాలని పిలుపునిచ్చారు. డీహెచ్‌పీఎస్ గతంలో న్యాయస్థానాల్లో జడ్జిల నియామకంలో రిజర్వేషన్లు అమలు చేయాలని చేసిన పోరాటం పార్లమెంట్‌లో ప్రస్తావనకు వచ్చిందన్నారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో దళితుల హక్కులను ప్రస్తావించలేదన్నారు. రాముడ్ని రాజకీయ నాయకుడ్ని చేసినందుకు అయోధ్యలో బీజేపీ ఓడిపోయిందన్నారు. సదస్సుల్లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ముస్లిం జేఏసీ నాయకులు మునీర్ అహ్మద్, దళిత సంఘాల నాయకులు టి.చిట్టిబాబు, కొరివి వినయ్‌కుమార్ ప్రసంగించారు. తుపాకుల నాగేశ్వరరావు, డీహెచ్‌పీఎస్ విజయవాడ నగర అధ్యక్షుడు సంగుల పేరయ్య, ఎస్.శివాజీ, పరిశపోగు రాజేశ్, సీహెచ్ గోవింద్, విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు, దేశ్యానాయక్, మహిళా సమాఖ్య నాయకులు బి.శాంతమ్మ, జి.రాహేలమ్మ తదితరులు పాల్గొన్నారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప స్వాగతం పలుకగా... ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు వందన సమర్పణ చేశారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య అభ్యుదయ గీతాలు ఆలపించారు.

22న దేశవ్యాప్త ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. హిండెన్‌బర్గ్ బయట పెట్టిన సెబీ, అదానీ బంధంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టాక్‌మార్కెట్ చిరు పెట్టుబడిదారుల డబ్బుకు రక్షణ ఉండాలన్నారు. మోదీ ప్రభుత్వం తక్షణమే సెబీ చైర్‌పర్సన్‌ను పదవీ బాధ్యతల నుంచి తప్పించాలని, జేపీసీని ఏర్పాటు చేసి అదానీ సంస్థలపై విచారణ జరిపించాలని ఖర్గే డిమాండ్ చేశారు. 'నిరుద్యోగం, అధిక ధరలు, పొదుపు క్షీణత వంటి సమస్యలపై దృష్టిని కేంద్రీకరించాం. పేద, మధ్య తరగతికి మోసం జరిగింది. మా ప్రచారోద్యమంలో కులగణన డిమాండ్ ప్రధానం. రాజ్యాంగంపై బీజేపీ వరుస దాడులనూ తిప్పికొడతాం. రైతులకు ఎంఎస్పీ చట్టం కోసం కాంగ్రెస్ పోరాడుతోంది. అగ్నిపథ్ పథకాన్ని రద్దుకు డిమాండ్ చేస్తోంది' అని మల్లికార్జున ఖర్గే వెల్లడించారు. దేశంలో రైలు ప్రమాదాలు పెరగడంతో కోట్లాది మంది ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రకృతి విపత్తులు పెరగడం, మౌలిక వసతులు క్షీణించడం ఆందోళన కలిగిస్తున్నట్లు ఖర్గే పేర్కొన్నారు. తమ అన్ని డిమాండ్ల సాధన కోసం ఈనెల 22న దేశవ్యాప్త ఆందోళన చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించిందని పార్టీ అధ్యక్షుడు తెలిపారు. సమావేశం అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విలేకరులతో మాట్లాడుతూ 22వ తేదీన దేశవ్యాప్త ఆందోళన చేపట్టాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందని అన్నారు. అదానీ వ్యవహారంలో జేపీసీ విచారణ, సెబీ చీఫ్ రాజీనామా డిమాండ్‌తో ఆందోళనబాట పట్టబోతోన్నట్లు తెలిపారు. ఈ ఆందోళనను జయప్రదం చేయాలని కాంగ్రెస్ వర్గాలకు సూచించారు.

తుంగభద్ర గేటు పనులు

(మొదటిపేజీ తరువాయి)

కన్నయ్య నాయుడు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారని, మూడు సంస్థలకు గేట్ల నిర్మాణం బాధ్యతలు అప్పగించామని తెలిపారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ లక్ష క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేస్తున్నామని, ఈ సమస్యతో విలువైన సాగు, తాగు నీటిని కోల్పోతున్నామని తెలిపారు. కొట్టుకుపోయిన 19వ గేటు వద్ద 5 గేట్లను ఏకకాలంలో పూర్తి చేసేలా చేపడుతున్నామన్నారు. డ్యామ్ వద్ద 1625 అడుగులు నీరు ఉండగానే గేట్లు అమర్చే ప్రయత్నం చేస్తున్నామని, బుధవారం ఉదయానికి గేట్లు వస్తాయనే నమ్మకం ఉందన్నారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడం గత పాలకుల నిర్లక్ష్యమన్నారు.

డ్యామ్‌ను పరిశీలించిన కర్నాటక సీఎం సిద్దరామయ్య

తుంగభద్ర డ్యామ్‌ను కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య మంగళవారం పరిశీలించారు. ఆయనతో పాటు ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, కర్నాటక నీటిపారుదల శాఖ మంత్రి భోసరాజు, మంత్రి శివరాజ్ తంగడిగే, కర్నాటక, ఆంధ్ర రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ డ్యామ్ సమస్యను బీజేపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని, తనకు రాజకీయం ముఖ్యం కాదని, రైతులే ముఖ్యమని తెలిపారు. జలాశయంలో ప్రస్తుతం 105 టీఎంసీల నీరు ఉండగా, డ్యామ్ నుంచి 50 నుంచి 60 టీఎంసీల నీరు వృధాగా పోతుందని అన్నారు.

కాంగ్రెస్‌కు పట్టువిడుపులు అవసరం

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయిలో మద్దతిచ్చిందని గుర్తుచేశారు. కేరళ రాజకీయ పరిస్థితి ఎప్పుడూ భిన్నమేనన్నారు. పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ కోసం పోటీ చేయాల్సిన దాని కంటే తక్కువ స్థానాల్లో లెఫ్ట్ పోరాడిందని రాజా తెలిపారు. మహారాష్ట్రలో మహావికాస్ అగాదీ, జార్ఖండ్‌లో జేఎంఎం-కాంగ్రెస్ సంకీర్ణం సముచిత స్థానాలను లెఫ్ట్‌కు లభిస్తాయని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ఆ రాష్ట్రాల్లో లెఫ్ట్‌కు పట్టున్నదని, కార్మిక, రైతు సంఘాల ఆదరణనూ దృష్టిలో పెట్టుకొని సీట్ల సర్దుబాటు చేయాలని రాజా సూచించారు.

కోల్‌కతా వైద్యురాలిపై పాశవికదాడి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనలో విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. వైద్యురాలిని నిందితుడు గొంతునులిమి చంపాడని, ఆ పెనుగులాటలో ఆమె థైరాయిడ్ కార్టిలేజ్ విరిగిపోయిందని పోస్టుమార్టం నివేదిక వెల్లడించింది. అసహజ లైంగిక చర్య... పాశవిక దాడి కారణంగా అంతర్గత అవయవాల వద్ద లోతైన గాయం అయినట్లు వెల్లడైంది. ఆగస్టు 9న తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఐదు గంటల మధ్యలో ఈ ఘటన జరిగినట్లు సంబంధిత వర్గాల సమాచారం ఆధారంగా మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఉదరభాగం, పెదాలు, వేళ్లు, ఎడమకాలు వద్ద గాయాలున్నాయని, ఆమె కేకలు వినిపించకుండా ఉండేందుకు తలను గోడకు అదిమిపట్టి ముక్కు, నోరు మూసివేసినట్లు ఆ నివేదికలో తేటతెల్లమైంది.

వైద్య కళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ కోటాపై స్టే

(మొదటిపేజీ తరువాయి)

న్యాయవాది యరగొర్ల ఠాకూర్ యాదవ్ వాదించారు. ప్రైవేటు కళాశాలల్లో సీట్లు పెంచకుండానే ఈడబ్ల్యూఎస్ కింద సీట్లు ఇవ్వాలని ప్రభుత్వం జీవో జారీ చేసిందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. సీట్లు పెంచకుండా ఈడబ్ల్యూఎస్ కోటా కింద సీట్లు కేటాయిస్తే ఓపెన్ కేటగిరీ విద్యార్థులు నష్టపోతారని వివరించారు. తక్షణమే ఈ జీవోను నిలుపుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పిటిషనర్ వాదనతో ఏకీభవించిన కోర్టు... ప్రభుత్వం ఇచ్చిన జీవోను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను న్యాయస్థానం ఆరు వారాలకు వాయిదా వేసింది.

కిడ్నీ బాధితుల రక్షణకు చర్యలేవీ?

ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసం పాదయాత్రను జయప్రదం చేయండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: ఎన్టీఆర్ జిల్లాలో ప్రజారోగ్య పరిరక్షణ కోసం సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సమితి అధ్వర్యంలో ఆగస్టు 27, 28, 29 తేదీలలో ఏ.కొండూరు నుండి విజయవాడ వరకు జరగనున్న 'ప్రజా ఆరోగ్య పరిరక్షణ పాదయాత్ర'ను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక దాసరి భవన్‌లో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య అధ్యక్షతన మంగళవారం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో కిడ్నీ బాధితుల ప్రాణాలు పోతున్నా... కృష్ణా జలాలు సరఫరా చేయాలని వేడుకుంటున్నా పాలకులకు పట్టడం లేదని విమర్శించారు. వందల మంది కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నా... తాగుతున్న మంచినీళ్లే ప్రాణాలు కబలిస్తున్నా ఊరు వదలలేక ఊపిరి వదులుతున్నారని చెప్పారు. తాగునీటి కోసం రూ.50 కోట్లతో కృష్ణా జలాలను పైప్‌లైన్‌ల ద్వారా సరఫరా చేస్తామని చెప్పిన నాటి ప్రభుత్వ వాగ్దానాలు ఆచరణలో అమలు కాలేదని విమర్శించారు.

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ ఫ్లోరైడ్, సిలికాన్ కలిసిన నీరు తాగిన గిరిజనులు కిడ్నీ వ్యాధి బారినపడి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని, కంటితుడుపుగా ఎ.కొండూరులో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌లో అర్హత కలిగిన నిపుణులు, అంబులెన్స్ లేకపోవుట వలన గిరిజనుల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'జలజీవన్ మిషన్' అడుగు ముందుకు కదలలేదన్నారు. కిడ్నీ బాధితులను కాపాడాలని సీపీఐ అధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామని, ఆ పోరాట ఫలితంగానే ఏ.కొండూరు తిరువూరులలో డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేశారని, గ్రామాలకు ట్యాంకుల ద్వారా సురక్షిత మంచినీరు పంపిణీ చేస్తున్నారని గుర్తుచేశారు. కిడ్నీ బాధితులకు శాశ్వత పరిష్కారం కోసం కృష్ణా జలాలు, సురక్షిత మంచినీరు అందించాలని, ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసం సీపీఐ చేపట్టిన పాదయాత్ర జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా పాదయాత్రలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేశ్, కార్యదర్శి వర్గసభ్యులు చుండూరు వెంకట సుబ్బారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పరుచూరి రాజేంద్ర, లంక దుర్గారావు, బుట్టిరాయప్ప, నక్క వీరభద్రరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లంకా గోవిందరాజులు, షేక్ సుభాని, షేక్ నాగుల్ మీరా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, ఎ.కొండూరు మండల కార్యదర్శి మేకల డేవిడ్, విస్సన్నపేట మండల కార్యదర్శి త్యాగరాజు, మైలవరం మండల కార్యదర్శి బుద్ధారపు వెంకట్రావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకులు పంచదార్ల దుర్గాంబ, విజయవాడ రూరల్ మండల కార్యదర్శి ఉప్పె నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎవరు తప్పు చేసినా... శిక్షార్హులే: మంత్రి అనగాని

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: తప్పు ఎవరు చేసినా చట్ట ప్రకారం శిక్ష ఎదుర్కోవాల్సిందేనని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో అధికారులతో చర్చించిన తర్వాతే కేసు పెట్టామని తెలిపారు. ఈ కేసులో అన్ని ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ప్రతి సారీ వైసీపీ నేతలు రెడ్‌బుక్ అంటున్నారని, రెడ్ బుక్ తెరిస్తే వాళ్లు ఈ రాష్ట్రంలో ఉండలేరన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ నేతలు చేసిన అక్రమాలను బయటకు తీస్తామని తెలిపారు. భూములపై వచ్చే ఫిర్యాదుల్లో 75 శాతం వైసీపీ నేతలపై వచ్చినవేనని... వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ చేసిన భూ ఆక్రమణలు బయటపడుతున్నాయని చెప్పారు. కేసుల్లో అక్రమంగా ఇరికేందుకు తమ పార్టీ వ్యతిరేకమన్నారు. చంద్రబాబు ఇంటిపై దాడికి ప్రయత్నించినప్పుడు ఈ మాటలు ఏమయ్యాయని జోగి రమేశ్‌ను ప్రశ్నించారు. కులం పేరుతో రెచ్చగొట్టే మాటలు ఇప్పుడు మాట్లాడుతున్నారని... అమరనాథ్ గౌడ్ హత్య జరిగినప్పుడు కులం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. జోగి బెదిరింపులకు ఎవరూ భయపడరన్నారు. అగ్రిగోల్డ్ భూములను కబ్జా చేశారు కాబట్టే అడ్డంగా దొరికిపోయారని అన్నారు.

'అగ్రి' ఆస్తుల్ని కాపాడండి

రాష్ట్ర ప్రభుత్వానికి ముప్పాళ్ల విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అగ్రిగోల్డ్ ఆస్తుల రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అగ్రిగోల్డ్ కంపెనీ మోసానికి ఒక్క ఏపీలోనే 600 మంది పైచిలుకు కస్టమర్లు, ఏజెంట్లు ఆత్మహత్యలకు, అసహజ మరణాలకు గురయ్యారని గుర్తు చేశారు. ఇక కర్నాటక, తెలంగాణ, ఒడిశాలో కూడా వేలాదిమంది ఏజెంట్లు, బాధితులు కంపెనీ మోసానికి బలయ్యారన్నారు. రాష్ట్రంలోని అనేక జిల్లాలలో అటాచ్‌మెంట్ చేసిన అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తులను కూడా అడ్డగోలుగా అమ్ముకోవడం, స్వాధీనపరచుకోవడం జరుగుతున్న విషయాన్ని గత మూడు, నాలుగు సంవత్సరాలుగా గత ప్రభుత్వం, సీఐడి దృష్టికి అసోసియేషన్ తీసుకెళ్లిందని తెలిపారు. విజయవాడ అంబాపురంలో మాజీ మంత్రి జోగి రమేశ్ ఉదంతంతోపాటు, కడప, కర్నూలు, అనంతపురం, ప్రకాశం, విజయనగరం తదితర జిల్లాల్లో వ్యవసాయ భూముల్లో ఉన్న తోటలను, స్థలాలను, కంపెనీ భూముల్లో ఉన్న మట్టిని యథేచ్ఛగా కబ్జా చేస్తుంటే గత పాలకులు పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వ కాలంలో అగ్రి ఆస్తులను తాకట్టుపెట్టి రుణం తీసుకోవడానికి సంబంధించిన ఫైల్ గవర్నర్ దగ్గరకు పంపినట్లు పత్రికల్లో వార్తలు చూశామన్నారు. అటాచ్‌మెంట్ చేసిన కంపెనీ ఆస్తులు కోర్టు ద్వారా నేటికీ అబ్సొల్యూట్ చేయించడం జరగలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు అటాచ్‌చేసిన కంపెనీ ఆస్తులన్నింటినీ వెంటనే స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆస్తిగా పరిగణించాలని... వాటిని వేలం వేసి వచ్చిన డబ్బులను ప్రభుత్వ ఖజానాకు జమ (అబ్సొల్యూట్) చేయాలని, అగ్రి ఆస్తులను కాపాడాలని, బాధితులకు న్యాయం చేకూర్చడానికి సమర్థ అధికారులతో స్పెషల్ పర్పస్ వెహికిల్ ఏర్పాటు చేయాలని, కంపెనీకి చెందిన వివిధ ఆస్తులపై వచ్చే ఆదాయం కోర్టుకు జమ పడేలా చూడాలని, కంపెనీ యజమానుల పేరుమీద ఉన్న ఆస్తులన్నింటినీ జప్తు చేయించాలని ముప్పాళ్ల కోరారు. రాష్ట్రంలో రూ.3,080 కోట్లు 10.50 లక్షల మంది బాధితులకు అందవలసి ఉందని, వారికి రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేకూర్చుతుందనే నమ్మకంతో బాధితులు ఉన్నారని తెలియజేశారు.

మోసపోయిన రైతులను ఆదుకోండి

ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర -నూజివీడు: దళారుల చేతిలో మోసపోయిన రైతులను ఆదుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘాల అధ్వర్యంలో నూజివీడులోని అమర్ భవన్‌లో ధాన్యం రైతులు సమావేశం జరిగింది. అనంతరం నూజివీడు సబ్ కలెక్టర్ ఆఫీస్ దగ్గర ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతులు దళారులకు పంట అమ్మి నష్టపోయారని తెలిపారు. ధాన్యాన్ని కొనుగోలు రైతులను మోసగించిన నూజివీడు మండలం అన్నవరం గ్రామానికి చెందిన మల్లూరు వెంకట నాగచంద్రశేఖర్, అతని సోదరుడు సురేష్ నుంచి బాధిత రైతులకు ధాన్యం డబ్బులు ఇప్పించాలన్నారు. ఈ విషయంపై మే 25న నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో 65 మంది రైతులు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆయన విమర్శించారు. నూజివీడు మండలంలోని సుంకొల్లు, పడమట దిగవల్లి, అన్నవరం, సూరేపల్లి, మొక్కొల్లుపాడు, చాట్రాయి మండలానికి చెందిన సోమవరం తదితర గ్రామాల రైతులు, కౌలు రైతులు సుమారు 116 మందికి చెందిన కోటి రూపాయల విలువైన ధాన్యాన్ని కల్లాల్లో ఉండగానే దళారులు కొనుగోలు చేసి, రైతులకు సొమ్ము చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధాన్యం వ్యాపారస్తుల దగ్గర నుంచి డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని నూజివీడు సబ్ కలెక్టర్ వై.భవానీ శంకర్‌ను కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామారావు మాట్లాడుతూ ధాన్యం అమ్ముకొని నష్టపోయిన రైతులందరూ పేద రైతులని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు మాట్లాడుతూ నష్టపోయిన ధాన్య రైతులకు న్యాయం జరిగే వరకూ ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు. ధాన్యం డబ్బులు రాబట్టేందుకు 16 మందితో పోరాట కమిటీ ఏర్పరచుకున్నారు. ఈ కమిటీకి సుంకొల్లు గ్రామానికి చెందిన గంగుల గిరీష్ బాబు కన్వీనర్‌గా, దిగవల్లి గ్రామానికి చెందిన కస్తూరి శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు, రైతు సంఘం నూజివీడు నియోజకవర్గ అధ్యక్షులు మడుపల్లి నాగేంద్రరావు, రైతు సంఘం ఉపాధ్యక్షులు కూచిపూడి నాగేశ్వరరావు, గంగుల గిరీష్ బాబు, కస్తూరి శ్రీనివాసరావు, పెద్దలంక వీరవెంకయ్య, కట్టపోయిన ప్రసాద్ కంచర్ల నాగరాజు, గుగులోతు కోటేశ్వరరావు, మందపాటి రంగారావు, నల్లిపోయిన నాగరాజు, కళవల వెంకటేశ్వరరావు, మూడుమంతుల రాంబాబు, కొణతల అప్పారావు, పామర్తి ఏడుకొండలు, లింగం రఘుబాబు, వేమూరి మధు, గుంట్రూ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఐ కార్యాలయాలు ఏర్పాటు చేయండి

కిషన్ రెడ్డికి కొల్లు రవీంద్ర విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ), ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ (ఐబీఎం) ప్రాంతీయ కార్యాలయాలు రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డికి రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలోని కిషన్ రెడ్డి కార్యాలయానికి వెళ్లి వివిధ అంశాలను తీసుకెళ్లారు. రాష్ట్రంలో మైనింగ్ రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రత్యేక మైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) లో మైనింగ్, మినరల్ ప్రాసెసింగ్‌లో ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టాలన్నారు. ప్రత్యేక గ్రానైట్ ప్రమోషన్ బోర్డును ఏర్పాటు చేయాలని, ఆర్ఐఎన్ఎల్‌కు క్యాప్టివ్ ఇనుప ముడి ఖనిజం, బొగ్గు గనులను తక్షణమే కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్రిటికల్ మినరల్ ప్రాసెసింగ్ పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని, ఆఫ్‌షోర్ మైనింగ్ వేలంలో పాల్గొనేందుకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

బాబు హయాంలో విద్యారంగం తిరోగమనం

ఆదిమూలపు సురేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా రంగం తిరోగమనం బాట పట్టిందని మాజీ మంత్రి ఆదిమూలపు సురేశ్ అన్నారు. కొన్ని సర్దుబాట్లు చేయాలనే సాకుతో విద్యా రంగాన్ని ప్రక్షాళన చేయాలని, సంస్కరణలు చేస్తామంటూ రకరకాలుగా మాట్లాడుతున్నారని ఆయన చెప్పారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అదే సమయంలో గత ప్రభుత్వం అమలు చేసిన ఒక్కో పథకాన్ని ఒక పద్ధతి ప్రకారం ఎత్తేస్తున్నారని ఆదిమూలపు సురేశ్ గుర్తు చేశారు. టోఫెల్ శిక్షణ రద్దు, ఇంగ్లీషు మాధ్యమాలను ఎత్తివేసే కార్యక్రమంపై ప్రభుత్వ పెద్దల మాటలు చూస్తుంటే... విద్యా రంగం అస్తవ్యస్తం అవుతోందన్న విషయం స్పష్టమవుతోందన్నారు. నాడు సీఎం జగన్ నేతృత్వంలో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, ఆ రంగంపై ఏకంగా రూ.73 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దితే, దానిపైనా లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆక్షేపించారు. ఇవన్నీ చూస్తుంటే, ఈ ప్రభుత్వం జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) కి అనుకూలమా? వ్యతిరేకమా? అన్న అనుమానం కలుగుతోందని, అసలు ఆ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తారా? లేదా? చెప్పాలని డిమాండ్ చేశారు.

బియ్యం గోదాం హమాలీలకు ఈఎస్ఐ, పీఎఫ్

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ బియ్యం గోదాముల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. విజయవాడ దాసరి భవన్‌లో మంగళవారం ఎం.మన్మథరావు అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికులకు ఈఎస్ఐ లేకపోవటంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని, పీఎఫ్ ఉన్నప్పటికీ దాని ద్వారా ఎటువంటి క్లెయిములు రావడం లేదన్నారు. 58ఏళ్లు నిండి 10 సంవత్సరాల పీఎఫ్ పూర్తి అయిన వారికి పెన్షన్ రావాల్సి ఉందన్నారు. పౌర సరఫరాల శాఖలో పీఎఫ్ అధికారులు ఏమాత్రం పట్టించు కోవడంలేదన్నారు. రేషన్ షాపుల కుదింపు వల్ల హమాలీ కార్మికులకు పని భద్రత కోల్పోతున్నారని తెలిపారు. ముఖ్యంగా రెండేళ్లకోసారి జరిగే అగ్రిమెంట్ ప్రకారం కూలి రేట్ల పెంపు 2024 జనవరి ఒకటో తేదీ నుండి అమలు చేయాల్సి ఉండగా ఇంతవరకు పట్టించుకోవడంలేదన్నారు. తక్షణం కూలి పెంపుదల జీవో విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సొంత గోదాములు నిర్మించాలని ఆ గోదాములలో హమాలీలకు భోజనం, తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. హమాలీలకు యూనిఫామ్ కుట్టుకూలీ ఇవ్వాలని, దసరా పండుగకు బోనస్ పెంచాలని డిమాండ్ చేశారు. హమాలీలు చేసిన పనికి పదో తేదీ లోపు వారి బిల్లులు చెల్లించాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యం చేస్తూ 25వ తేదీ దాటాక ఇవ్వటం దారుణం అన్నారు. హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 1 2 3 తేదీలలో విశాఖపట్నంలో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలని...అధిక సంఖ్యలో హమాలీ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రావుల అంజిబాబు, చిక్కాల గోవిందు, పెంచలయ్య, శ్రీమన్నారాయణ, నరసింహులు, అయ్యప్ప, పైడయ్య, బాషా పాల్గొన్నారు.

యువజన హక్కుల సాధనకు కృషి

రాజేంద్రబాబు

విశాలాంధ్ర-విజయవాడ: సెప్టెంబరు 3,4,5 తేదీలలో విజయవాడలో జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు కోరారు. స్థానిక దాసరి భవన్ ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయం నందు వర్క్ షాప్ కరపత్రాలను మంగళ వారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేంద్ర బాబు మాట్లాడుతూ యువతలో ప్రగతిశీల అభ్యుదయ భావాలను, దేశభక్తి, లౌకిక ప్రజాస్వామ్య ఆలోచనలను, నైతిక విలువలు, సమానత్వాన్ని నెలకొల్పడానికి ఏఐవైఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. దేశం కోసం ప్రాణాలర్పించిన సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు లాంటి అమరవీరుల వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని ఏఐవైఎఫ్ 1959 మే 3న ఏర్పడిందని అన్నారు. 64 సంవత్సరాలుగా యువజన హక్కుల సాధన కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తూ సమరశీల యువజన ఉద్యమాల వేదికగా ముందుకు సాగుతుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం షరతులు లేకుండా నిరుద్యోగ భృతి ఇవ్వాలని పోరాడుతుందన్నారు. రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌లో ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, యువజన సమస్యలపై ఉద్యమ కార్యాచరణ గురించి చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు లంకా గోవిందరాజులు, కార్యదర్శి షేక్ సుభానీ, జిల్లా సహాయ కార్యదర్శి సింగం శెట్టి మోహన్ ప్రసాద్, ఉపాధ్యక్షులు గుంజ క్రాంతి కుమార్, శీరం రవికుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కార్తీక్, హరీష్, యువజన సమాఖ్య మాజీ నాయకులు చీకటి సైదారావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఏకపక్ష నిర్ణయాలపై పోరాటం: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బీజేపీ ఏకపక్ష నిర్ణయాలపై దేశ వ్యాప్త పోరాటాలకు సిద్ధమవుతున్నామని, క్షేత్రస్థాయిలోకి బీజేపీ అవినీతిని తీసుకెళ్లే కార్యాచరణ ఉండబోతోందని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల తెలిపారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌ను సంస్థాగతంగా బలోపేతం చేసే అంశంపై చర్చించామని, ఆ దిశగా కార్యాచరణ చేపడుతున్నామని చెప్పారు. ఢిల్లీలో మంగళవారం ఏఐసీసీ సమావేశం ముగిశాక షర్మిల మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారని, ఇటీవల పార్లమెంట్‌లో బీజేపీ అనుసరించిన వైఖరిపై చర్చించామన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా అందరి అభిప్రాయాలను గౌరవించే సంప్రదాయం ఒక్క కాంగ్రెస్ పార్టీలోనే ఉందని స్పష్టంచేశారు. బీజేపీ మైనార్టీల మనోభావాలను దెబ్బ తీసిందని, వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ మీద బీజేపీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని పేర్కొన్నారు. వక్ఫ్ చట్ట సవరణ మైనార్టీల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని, భారత రాజ్యాంగాన్ని బీజేపీ గౌరవించడం లేదన్నారు. సెబీ ఆదాని అంశం ఈ సమావేశంలో చర్చకు వచ్చిందని, సెబీని తన గుప్పెట్లో పెట్టుకొని ఆదానిని కాపాడుతున్నారని తెలిపారు.

పెద్దల సభను గౌరవించే పోటీ పెట్టలేదు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: పెద్దల సభను గౌరవించేందుకే కూటమి ప్రభుత్వం ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థిని పోటీలో పెట్టలేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ అన్నారు. మంగళవారం విశాఖలోని టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో హోం మంత్రి అనితతో కలిసి ఆయన మాట్లాడుతూ పెద్దల సభను గౌరవించేలా తమ అధినేత చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని, విశాఖ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం విలువలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాల గొంతు నొక్కారని, సంఖ్య తక్కువగా ఉందని పెద్దల సభనే రద్దు చేద్దామని ఆలోచన చేసిన వ్యక్తి జగన్ అన్నారు. పెద్ద సభలో అయినా వైసీపీ సభ్యులు సక్రమంగా వ్యవహరించాలని కోరారు. మంత్రి అనిత మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ కూడా వేయనివ్వలేదని, అలాంటి పరిస్థితుల్లో అప్పుడు టీడీపీ పోటీ చేయలేదన్నారు. విలువలకు కట్టుబడే ఇప్పుడు పోటీ చేయడం లేదని తెలిపారు. మేము గెలవాలనుకుంటే చాలా సులభతరమని, అనేక మంది వైసీపీని వీడి కూటమిలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తన భద్రత గురుంచి జగన్ గగ్గోలు చేస్తున్నారని, జగన్ ఓ ఎమ్మెల్యే మాత్రమే అని గుర్తుంచుకోవాలన్నారు. అయినా 58 మందితో భద్రత ఇస్తున్నామన్నారు. జగన్ భార్యకు, తల్లికి 2+2 సెక్యూరిటీ ఇస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో భువనమ్మకు సెక్యూరిటీ ఇవ్వలేదని చెప్పారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, శాసనమండలి సభ్యులు దువ్వారపు రామారావు, దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ సీతంరాజు సుధాకర్, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతబ్బాయి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జనసేన నాయకురాలు ఉషా కిరణ్, టీడీపీ నాయకులు కిడారి శ్రావణ్ కుమార్, దొన్ను దొర, ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి పుచ్చ విజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమరశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి కొట్నీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో కొందరు ఐఏఎస్ అధికారులకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్‌కు ఏపీఎస్ఎఫ్‌సీ ఎండీగా, వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్‌గా ఉన్న సునీతకు రైతు బజారు సీఈవోగా, సమాచార శాఖ డైరెక్టర్ శుక్లాకు డిజిటల్ కార్పొరేషన్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. హౌసింగ్ కార్పొరేషన్, వీకర్ సెక్షన్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా రాజబాబును నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

భూసమస్యలు పరిష్కరిద్దాం

ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రెవెన్యూ సదస్సులతో రాష్ట్రంలో భూ సమస్యలు తీరతాయన్న ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా రెవెన్యూ ఉద్యోగులంతా కష్టపడి పనిచేయాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, కె.రమేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ... రెవెన్యూ శాఖకు పట్టుకొమ్మగా ఉన్న గ్రామ స్థాయి వ్యవస్థ మరింత సమర్థంగా పనిచేయడానికి రెవెన్యూ సదస్సులు ఉపకరిస్తాయని పేర్కొన్నారు. భరించలేని పని ఒత్తిడితో అత్యంత వేగంగా చేయించిన రీ సర్వేలో జరిగిన చిన్న చిన్న పొరపాట్లను, కొంతమంది కబ్జాదారుల విశృంఖల చర్యలతో భూ యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. నూతన ప్రభుత్వం ఈనెల 15 నుంచి సెప్టెంబరు 30 వరకు, 45 రోజుల పాటు రాష్ట్రంలోని ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం పట్ల రెవెన్యూ శాఖ, భూ యజమానులు, రైతులు, ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పొరపాట్లు సరిదిద్దుకోవడానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని, భూ రికార్డులను మనం కాపాడుకుంటే, రెవెన్యూ వ్యవస్థ మనల్ని రక్షిస్తుందని పేర్కొన్నారు. భూ సమస్యలను పరిష్కరించి మన రికార్డులను ఉన్నతీకరణకుగాను ఒక మంచి అవకాశం మనకు వచ్చిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ ఉద్యోగి సైతం ఈ సదస్సుల విజయవంతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రైతులకు పెట్టుబడి సాయం: జంగాల డిమాండ్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. రైతులు ప్రస్తుతం వ్యవసాయం ప్రారంభించారని, ఈ సమయంలో సాయం అందజేస్తే అన్నదాతలు ఊరట చెందుతారని చెప్పారు. ప్రభుత్వం వైపు నుంచి సకాలంలో సాయం అందకుంటే కౌలు, చిన్న, సన్నకారు రైతులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ మేరకు గుంటూరు మల్లయ్యలింగం భవన్ నుంచి మంగళవారం వీడియో సందేశాన్ని జంగాల విడుదల చేశారు. అనేక సంవత్సరాలుగా రైతాంగం పంట దెబ్బతిని పూర్తిగా నష్టాల ఊబిలో కూరుకుపోయారని తెలిపారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు నాయుడు వ్యవసాయానికి పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఆర్థిక సహాయం అందిస్తానని ఎన్నికల ముందు, తరువాత చెప్పడంతో రైతాంగం కొంత ఊరట చెందారన్నారు. ప్రస్తుతం రైతులు పెట్టుబడి సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలు ముందస్తు పెట్టుబడి కింద రైతులకు ఆర్థిక సాయం చేయాలని కోరారు.

కూతురుపై తల్లి దాష్టీకం

విశాలాంధ్ర-పెందుర్తి (విశాఖ): సభ్యసమాజం తలదించుకునేలా కన్న కూతురుపై తల్లి కర్కశంగా వ్యవహరించిన ఘటన విశాఖపట్నం కార్పొరేషన్ పరిధిలోని 96 వార్డు సింహాద్రి నగర్‌లో చోటుచేసుకుంది. 13 సంవత్సరాల మైనర్ బాలికను చావచితకబాది పైశాచిక ఆనందం పొందిన తల్లి తీరుపై స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. కేవలం గిన్నెలు కడగలేదన్న కారణంతో ఆ బాలిక శరీరంపై వాతలు తేరేలా చితక్కొట్టింది. పెదవులు, ముక్కు నుంచి రక్తం ధారగా వస్తున్నా కనికరించకుండా తన ప్రతాపం చూపింది. స్థానికుల సమాచారం ప్రకారం సింహాద్రి నగర్‌కు చెందిన 13 ఏళ్ల పర్వేశా తల్లిదండ్రులు గతంలో విడాకులు తీసుకున్నారు. దీంతో కుమారుడు హైదరాబాద్‌లో అమ్మమ్మ, తాతయ్య వద్ద ఉండగా, కుమార్తె పర్వేశా తల్లి స్వాతితో కలిసి ఉంటోంది. ఈ క్రమంలో తల్లి స్వాతి సొంత కూతురు అని కూడా చూడకుండా పర్వేశాను వేధించసాగింది. అయినదానికి, కానిదానికి చిత్రహింసలకు గురిచేసేది. తీవ్రంగా గాయపడిన పర్వేశాను స్థానికులు పెందుర్తి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. భయకంపితురాలైన బాలిక పర్వేశా మాట్లాడుతూ చిన్న విషయాలకే తన తల్లి ఇష్టం వచ్చినట్లుగా కొట్టి వేధిస్తున్నట్లు కన్నీరు మున్నీరుగా విలపించింది. తనకు రక్షణ కల్పించాలని ప్రాథేయపడింది. ప్రస్తుతం బాలిక తీవ్ర భయాందోళనతో ఉందని, వైద్యం అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. పర్వేశా కోలుకునేందుకు విశ్రాంతి అవసరమని అన్నారు. మరోవైపు స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పెందుర్తి పోలీసులు తల్లి స్వాతిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మరోవైపు కసాయిగా వ్యవహరించిన స్వాతిని కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సంపాదకీయం

ప్రసార బిల్లుపై వెనుకడుగు

వార్తలు తెలుసుకోవడంకోసం మర్నాటిదాకా వేచి చూడవలసిన అగత్యం డిజిటల్ మీడియా అవతరణ తరవాత లేకుండా పోయింది. సమాచారం, వ్యాఖ్యల కోసం ఇప్పుడిప్పుడే డిజిటల్ మీడియా మీదే ఆధార పడ్తున్నారు. ఈ వేదికలలో ఎక్కువ జనాదరణ ఉన్న సంస్థలలో ఎక్కువ భాగం మోదీ ప్రభుత్వ దుష్ట విధానాలను ఎండగడ్తున్నాయి. అందువల్ల వీటికి ఎక్కువ జనాదరణ ఉంటోంది. రవీశ్ కుమార్, అజిత్ అంజుం, అభిసార్ శర్మ, ధృవ్ రాఠీ లాంటి వారి డిజిటల్ మీడియా నిర్వాహకుల పేరెత్తితేనే మోదీ ప్రభుత్వం వెన్నులో స్పష్టమైన ఒణుకు కనిపిస్తోంది. దీన్ని అదుపు చేయడానికే బ్రాడ్ కాస్టింగ్ బిల్లు తీసుకు రావాలనుకున్నారు. కానీ ఈ ప్రయత్నానికి విపరీతమైన వ్యతిరేకత వ్యక్తమైనందువల్ల ప్రభుత్వం వెనక్కు తగ్గక తప్పలేదు. గత పదేళ్లుగా మోదీ ప్రభుత్వం నిర్వహించిన తీరుకు ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో బీజేపీకి కనీస మెజారిటీ దక్కనందువల్ల మోదీ ఇష్టారాజ్యానికి కొంత మేరకైనా అడ్డంకులు ఎదురవుతున్నాయి. దీనికి అడ్డుకట్ట వేయాలన్నది మోదీ ప్రభుత్వ ప్రయత్నం. ప్రతిపాదిత బిల్లును ఇప్పుడు ఉపసంహరించినప్పటికీ మీడియాను అదుపు చేయాలన్న మోదీ లక్ష్యాన్ని వెనక్కు తీసుకున్నట్టు కాదు. మరో రూపంలో ఈ బిల్లును ప్రతిపాదించే ప్రమాదం పొంచేఉంది. నిర్భయంగా వార్తలు, వ్యాఖ్యలు అందిస్తూ మోదీ ప్రభుత్వ అకృత్యాలను వెల్లడిస్తున్న వారికి బిల్లు ఉపసంహరణ తాత్కాలిక ఉపశమనం కలిగించి ఉండవచ్చు. ముఖ్యంగా యూట్యూబర్లు ప్రస్తుతానికి ఊపిరి పీల్చుకునే అవకాశం చిక్కింది. ఈ బిల్లు ముసాయిదా గురించి 2023 నవంబర్‌లో మొట్ట మొదట ఉప్పందింది. అప్పటి నుంచి నిరపేక్షంగా పని చేసే వారు ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. తమకు అనుకూలమైన కొద్ది మందికే పంపించడం అంటేనే ప్రజలకు ఈ బిల్లులో ఏముందో తెలుసుకునే అవకాశం ఇవ్వకుండానే గుట్టు చప్పుడు కాకుండా పని కానిచ్చేయాలని కేంద్ర ప్రభుత్వం పన్నాగంగా కనిపిస్తోంది. మీడియాను అదుపు చేయడానికి బిల్లు ప్రతిపాదించాలన్న ప్రభుత్వ ఆలోచనే రాజ్యాంగం పూచిపడ్డ భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమే. ఈ బిల్లును ప్రభుత్వం తాత్కాలికంగానైనా వెనక్కు తీసుకోవడం అంటే తాము దేవతా వస్త్రాలలో ఉన్నామని మోదీ ప్రభుత్వం అంగీకరించడమే. తమకు అనుకూలమైన వారికి ముసాయిదా బిల్లును పంపించిన ప్రభుత్వం అక్టోబర్ 15కల్లా దీనిమీద అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. యూ ట్యూబుల ద్వారా వార్తలు, వ్యాఖ్యలు తెలుసుకునే వారి సంఖ్య 29 శాతం ఉందని సి.ఎస్.డి.ఎస్. సర్వేలో తేలింది. పత్రికల ద్వారా ప్రజలు తెలుసుకున్న సమాచారం 11 శాతం మాత్రమే ఉందని ఈ సర్వేలో వెల్లడైంది. యూట్యూబ్, వాట్సాప్ లాంటి సామాజిక మాధ్యమాలు జనాభిప్రాయాన్ని ఎక్కువగా నిర్దేశిస్తున్నాయని గ్రహించిన మోదీ ప్రభుత్వం వీటికి కళ్లెం వేయాలనుకుంది. ప్రభుత్వం రూపొందించిన ముసాయిదాబిల్లు చట్టరీత్యా కానీ, రాజ్యాంగ రీత్యాకానీ, రాజకీయ దృష్టిని బట్టి కానీ సవ్యంగాలేదు. ఇటీవలి ఎన్నికల ఫలితాల కారణంగా ఈ వాస్తవాన్ని మోదీ గ్రహించక తప్పని పరిస్థితి ఏర్పడింది. అందుకే ఉపసంహరించారు. రాజ్యాంగంలోని 19 (1) (ఎ) అధికరణం పౌరులందరికీ భావప్రకటనా స్వేచ్ఛ ప్రసాదించింది. పత్రికలు, వివిధ రకాల ప్రసార మాధ్యమాలకు ఉండే భావ ప్రకటనా స్వేచ్ఛ కూడా ప్రజలకు ఉన్న స్వేచ్ఛలో భాగమే. అందుకని ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లులో దీన్ని విచిత్రమైన రీతిలో కట్టడి చేయాలని అనుకుంది. ఉదాహరణకు ఈ దేశంలో ప్రజాభిప్రాయాన్ని మలిచే వారికి అడ్డు తగిలితే అది భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్నారన్న విమర్శ వస్తుంది కనక విదేశాలనుంచి జరిగే ప్రభుత్వ వ్యతిరేక ప్రసారాలు చేసే వారిని శిక్షించడానికి ఈ ముసాయిదాలో అవకాశం కల్పించారు. ధృవ్ రాఠీ వీడియోలను మన దేశంలో నిషేధిస్తారు అన్న మాట గట్టిగా వినిపించిన నేపథ్యాన్ని అర్థం చేసుకుంటే ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో స్పష్టం అవుతుంది. ప్రభుత్వ ప్రతిపాదనపై విపరీతమైన వ్యతిరేకత పెల్లుబికింది. విలేకరుల సమావేశాలు పెట్టి ఈ ముసాయిదాను దుయ్యబట్టారు.

భారత ప్రెస్ క్లబ్, ఎడిటర్స్ గిల్డ్ లాంటి సంస్థలూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ప్రతిపక్షాలూ గళమెత్తాయి. ఇప్పుడున్న ప్రతిపక్షం గత పదేళ్ల కాలంగా ఉన్నట్టు గొంతెత్తే సామర్థ్యం లేనిది కాదు. పార్లమెంటులోనూ, వెలుపల ప్రతిపక్షాలు ప్రభుత్వ అకృత్యాలను గట్టిగా ప్రతిఘటిస్తున్నాయి. యూట్యూబ్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రసారమయ్యే సమాచారం, వ్యాఖ్యల నిగ్గు తేల్చడానికి ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేస్తుందని ఈ ముసాయిదాలో ప్రతిపాదించారు. ఇది కచ్చితంగా సెన్సార్ షిప్ విధించడమే. వివిధ మాధ్యమాలు కూడా తాము అందించే సరంజామ నిగ్గు తేల్చడానికి కమిటీలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇది ప్రభుత్వం ఏర్పాటుచేసే కమిటీలకు అదనం. బిల్లు ముసాయిదాను ప్రభుత్వం తమకు అనుకూలమైన వారికే బట్వాడా చేసింది తప్ప జనాదరణఉన్న వారిని సంప్రదించే ఏ ప్రయత్నమూ చేయలేదు. అంటే సంప్రదింపులు అన్న లాంఛనాన్ని పూర్తి చేయడానికి మాత్రమే ప్రభుత్వం పరిమితం అయింది. డిజిటల్ న్యూస్ బ్రాడ్ కాస్టర్లందరినీ కూడా అదుపు చేయాలన్న సంకల్పం ఈ ముసాయిదాలో స్పష్టంగా ఉంది. యూట్యూబుల్లాంటివి నిర్వహించే వారు తమ వేదికలను ప్రభుత్వం దగ్గర నమోదు చేయించుకోవలసి ఉంటుంది. చేసుకోకపోవడం శిక్షార్హమైన నేరం అవుతుంది. మాధ్యమాలు ఏర్పాటు చేసే పర్యవేక్షక కమిటీలలో వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం ఉండాలన్న నిబంధనా ఉంది. ఈ జాబితాను ప్రభుత్వం ఆమోదించాలి. ఆ కమిటీ ఆమోదించిన సమాచారాన్ని మాత్రమే ప్రసారం చేయాలి. అసలు కమిటీ ఏర్పాటు చేయకపోవడం, ప్రభుత్వం దగ్గర నమోదు చేయకపోవడం లాంటి సందర్భాలలో రెండేళ్ల జైలుశిక్ష విధించే అవకాశమూ బిల్లులో చేర్చారు. ప్రతి వార్తను, వ్యాఖ్యను ఈ కమిటీల ఆమోదం తరవాతే ప్రసారం చేయాలన్న నియమం వల్ల ఆఖరి నిముషంలో ఏదైనా సంఘటన జరిగితే, ఆ సమయంలో కమిటీ సభ్యులు అందుబాటులో లేకపోతే ఆ వార్తను ప్రసారం చేయడానికి అవకాశం ఉండదు. ఇది భావప్రకటనా స్వేచ్ఛకు నిగళంగా తయారు కావడమే కాక, తాజా వార్తల ప్రసారాన్ని కూడా అడ్డుకుంటుంది. ఈ విషయంలో పొరపాటుచేస్తే రూ. 50 లక్షల జరిమానా విధిస్తారు. రెండోసారి అదే తప్పు చేస్తే మూడున్నర కోట్ల రూపాయల జరిమానా చెల్లించాలి. మూడేళ్ల శిక్ష విధించవచ్చు. ప్రభుత్వం ఏర్పాటుచేసే 11 మంది సభ్యుల కమిటీలో పత్రికా రచనలో నైపుణ్యం ఉన్నవారు కాకుండా అయిదుగురు అధికారులు ఉంటారు. వీరు ఎవరి పక్షాన నిలబడతారో చెప్పక్కర్లేదు. ఈ కమిటీ సిఫార్సుల ఆధారంగానే ప్రభుత్వం జరిమానాలు, శిక్షలు విధిస్తుంది. రాజ్యాంగంలోని 19 (2) అధికరణంలో భావ ప్రకటనా స్వేచ్ఛకు ఎనిమిది పరిమితులు ఉన్న మాట నిజమే కానీ ఎక్కడా ప్రసారంచేసే అంశాలను ప్రభుత్వం పర్యవేక్షించే అవకాశమే లేదు. ఈ దృష్టితో కూడా ఇది రాజ్యాంగ విరుద్ధమే. ప్రజా ప్రయోజనం ఏమిటో నిర్ణయించే అవకాశం రాజ్యాంగం ఇవ్వనే లేదు. అయినా ప్రజా ప్రయోజనం దృష్ట్యా ఈ ముసాయిదా బిల్లులోని అంశాలను రూపొందించామని ప్రభుత్వం చెప్తోంది.

పురిపండా అప్పలస్వామి, శ్రీశ్రీలతో వద్దాది సీతారామాంజనేయులు (ఎడమ నుండి కుడివైపు మూడవ వ్యక్తి)

దండాలు దండాలు

వద్దాది సీతారామాంజనేయ కవి

దండాలు దండాలు భారత మాతా!
అవి అందుకుని దీవించు భారత మాతా !!
గాంధీ మహాత్ముడు భారత మాతా!
నీ ముద్దు కొడుకున్నాడే భారత మాతా!!

నీ ముద్దు కొడుకుండగా భారత మాతా!
మా కేమి కొదవలేదు భారత మాతా!!
తిట్టినట్టి వాండ్లను భారత మాతా!
తిట్టనైన తిట్టమమ్మ భారత మాతా!!

కొట్టినట్టి వాడలను భారత మాతా!
కొట్టనైన కొట్టమమ్మ భారత మాతా!!
మమ్ము చంపబోయినారు భారత మాతా!
కొంచెమైన జంకమమ్మ భారత మాతా!!

కొంచెమైన బెదరమమ్మ భారత మాతా!
నీ పాదాల తోడు తల్లి భారత మాతా!!
మూడువందల యేండ్ల కింద భారత మాతా!
కంపెనోడు దిగినాడే భారత మాతా!!

నీ ఊరు కొన్నాడే భారత మాతా!
మన దేశమెల్ల దోచినాడే భారత మాతా!!
అడవులన్ని వాడివంట భారత మాతా!
వాడి అబ్బ వచ్చి వేసినాడ భారత మాతా!!

సముద్రాలు వాడివంట భారత మాతా!
వాడి తాతలొచ్చి తవ్వినార భారత మాతా!!
దండాలు దండాలు భారత మాతా!
అవి అందుకుని దీవించు భారత మాతా !!

(స్వాతంత్ర్యోద్యమ క్రమంలో రాసిన కవిత)

స్వాతంత్ర్య పరిరక్షణకు పునరంకితం కావాలి!

చలసాని వెంకటరామారావు

"జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అంటే కన్నతల్లీ, పుట్టిన దేశం ముందు స్వర్గం కూడా దిగదుడుపేనని అర్థం. పరాయి దేశస్థులు కన్నతల్లి వంటి పుట్టిన భూమిని చెరపట్టి 200 ఏళ్లపాటు బానిస సంకెళ్లతో ప్రజలను పాలించారు. స్వేచ్ఛా వాయువుల కోసం తపించిన భారతీయులు ఒక్కటిగా విజయమో వీరస్వర్గమో అంటూ ఆసేతుహిమాచల పర్యంతం ఎన్నో కష్టాలను, కన్నీళ్లను, బాధలను అనుభవించారు. లాఠీలకు, తూటాలకు ఎదురొడ్డి నిలిచారు. విజయమో, వీరస్వర్గమో అంటూ అడుగడుగున రక్తతర్పణ చేశారు. బ్రిటీష్ ముష్కర లాఠీలకు శరీరాలు అంకితం చేశారు. దీర్ఘకాల ప్రవాస శిక్షలను అనుభవించారు. చేత తుపాకులు, బాంబులుపట్టి రహస్య జీవితం గడిపారు. బ్రిటీషు పాలకుల ఉరితాళ్లకు తమ శిరస్సులను కానుకగా సమర్పించారు. మతం, కులం పక్కనపెట్టి ఒకే జాతిగా హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కులందరూ ఏకమై పోరాడారు. దేశాభిమానము మాకు కద్దంటూ స్వరాజ్య సాధనాకాంక్షతో ఉద్యమం సాగించారు. సంఘ సంస్కరణ, మత సంస్కరణ, జాతీయ పునరుజ్జీవనం ముప్పేటగా ఒక్కటై దేశభక్తియుత ఉద్యమం సాగింది. 1857 మీరట్ తిరుగుబాటుతో ప్రారంభమై 1947లో స్వాతంత్ర్యం సిద్ధించే వరకు వివిధ రూపాలలో అప్రతిహతంగా స్వాతంత్ర్య సమరం సాగింది. వేరువేరు పాయలగా ఉద్యమ ప్రస్థానం బ్రిటీష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది. 90 ఏళ్లపాటు సాగిన స్వాతంత్ర్య సమరంలో ఎంతో రక్త ం చిందింది. కన్నీరు వరదలా పారింది. త్యాగధనులు ఎందరో ఆత్మ బలిదానం చేశారు. 1757 జూన్ 23 న ప్లాసీ యుద్ధంలో బెంగాలు నవాబు సిరాజుద్దౌలా ఓటమితో ప్రారంభమైన బానిస అధ్యాయం నూరేళ్లపాటు బ్రిటీష్ దోపిడీ ఎదురులేకుండా సాగింది. 1857 మీరట్ తిరుగుబాటులో 10 వేలమందిని బ్రిటీష్ వాళ్లు ఉరితీశారు లేదా అగ్ని వర్షానికి ఆహుతి చేశారు. దీనితో ఈస్టిండియా కంపెనీ పాలనకు చరమగీతం పాడి బ్రిటీష్ రాణి స్వయంపాలన ప్రారంభమైంది. 1885 డిసెంబరు 28 న బొంబాయిలో గోకుల్‌దాస్ తేజ్‌పాల్ కళాశాలలో 'అలాన్ ఆక్టోవియన్ హ్యూమ్' అనే ఆంగ్లేయుని నేతృత్వంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఏర్పడింది. 1905 బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమం ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను తట్టిలేపింది. ప్రజలలో జాతీయ చైతన్యం వెల్లివిరిసింది. ఈ కాలంలోనే అతివాద ఉద్యమ బీజాలు మొలకెత్తి అనేక రహస్య విప్లవ సంఘాల నిర్మాణం జరిగింది. ఖుదీరాంబోసు, ప్రఫుల్లచాకీ వంటి ధీరోదాత్తులు ఆత్మ బలిదానం చేశారు. 1908లో అరవిందఘోష్ వంటి విప్లవ కార్యకర్తలు ఆలీపూర్ కుట్రకేసును ఎదుర్కొన్నారు. 1914, 15లో లాలా హరదయాళ్ గదర్ పత్రికను, పార్టీని అమెరికా గడ్డపై స్థాపించి స్వదేశ విముక్తికై కార్యకర్తలను, ఆయుధాలను సమీకరించాడు. సోహన్‌సింగ్ బాక్నా, జితేంద్రనాథ్ లహరి, దర్శి చెంచయ్యలతో 'కామాగాటా మారు' అనే నౌకలో హాంకాంగ్, కెనడా నుంచి బయలుదేరి సయాం కొండల మీదుగా సైన్యంతో బర్మా వెళ్లి బ్రిటీష్ వారితో యుద్ధంచేసి దేశ విముక్తి చేయాలని ప్రయత్నించారు. వీరు అరెస్టయి చిత్రహింసలు అనుభవించారు. ఈ క్రమంలో తెలుగువాడు దర్శి చెంచయ్య చైనా జాతీయ నాయకుడు 'సన్‌యెట్‌సేన్' ను కలిశారు. తెలుగువారు భాగవతుల సోమయాజి శర్మ, పి.జె.వెంకయ్య గదర్ ఉద్యమంలో పాల్గొన్నారు. 1914 మొదటి ప్రపంచ యుద్ధంలో 8 లక్షల మంది భారత సైనికులు బ్రిటీష్ వారి తరపున యుద్ధంలో పాల్గొన్నారు. అక్కడి విజయాలు భారతీయులలో ఆత్మవిశ్వాసం పెంపొందించాయి. భారత స్వాతంత్ర్యం కోసం పోరాడాలనే కాంక్షను పెంచాయి. 1919 జలియన్‌వాలాబాగ్ దురంతం భారతీయులలో క్రోధావేశాలను పెంచింది.

1915 లోనే మహాత్మా గాంధీ దక్షిణాఫ్రికా నుంచి భారత దేశం వచ్చారు. 7 నెలలపాటు దేశమంతా పర్యటించి సహాయ నిరాకరణ ఉద్యమానికి పిలుపునిచ్చారు. 1917 రష్యన్ విప్లవం ప్రపంచమంతా కమ్యూనిస్టు భావ చైతన్యాన్ని వెల్లువలా వ్యాప్తిచేసింది. సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా కార్మికవర్గం, కష్టజీవులు సంఘటితమై పోరాడారు. 1920లో ఏఐటీయూసీ, 1925 లో భారత కమ్యూనిస్టుపార్టీ స్థాపనతో దేశంలో శ్రామికవర్గ చైతన్యం వెల్లివిరిసి అనేక సమ్మెలు, పోరాటాలు జరిగాయి. సమ్మెలపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపింది. పోలీసు కాల్పులు, ప్రాణ త్యాగాలు జరిగాయి. బొంబాయి నగర వీధులు కార్మికుల రక్తంతో ఎరుపెక్కాయి. కమ్యూనిస్టు భావాలను తుంచివేసే ప్రయత్నంలో 1920లో పెషావర్ కుట్ర కేసు, 1924లో కాన్పూరు కుట్రకేసు, 1925లో కాకోరీ కుట్రకేసులను ప్రభుత్వం బనాయించింది. అనేకమంది కమ్యూనిస్టులను జైలు పాలుచేసింది. ఉరికంబాలు ఎక్కించింది. చంద్రశేఖర్ అజాద్, శచీంద్రనాథ్ బక్షి, అసఫాకుల్లా ఖాన్, రాజేంద్రనాథ్ లహరి, రాంప్రసాద్ బిస్మల్, రోషన్‌సింగ్, శచీంద్రనాథ్ సన్యాల్, మన్మథ గుప్తా వంటివారు ఉరిశిక్షలు, యావజ్జీవ ద్వీపాంతరవాస శిక్షలు అనుభవించారు. 1931 ప్రాంతంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ను లాహోర్ కుట్రకేసులో ఉరితీశారు. జైలులో జతిన్‌దాస్ నిరాహారదీక్షతో ప్రాణత్యాగం చేశాడు. 1931 ఫిబ్రవరిలో చంద్రశేఖర్ అజాద్ బొంబాయిలో పోలీసులతో హోరాహోరీ పోరులో తనకు తాను కాల్చుకుని చనిపోయాడు. 1930 లో చిట్టగాంగ్ ఆయుధాగారాన్ని విప్లవకారులు ముట్టడించటమే గాకుండా చిట్టగాంగ్ అడవులలో సూర్యసేన్, కల్పనాదత్, ప్రీతిలత వడ్డేదార్ నేతృత్వంలో సుదీర్ఘకాలం సాయుధపోరాటం సాగింది. 1940లో సుభాస్‌చంద్రబోస్ ఇండియన్ నేషనల్ ఆర్మీని స్థాపించి బర్మా అడవులలో బ్రిటీష్‌వారితో పోరాడారు. 1946లో బొంబాయిలో భారత నావికుల తిరుగుబాటు జరిగింది. బొంబాయి కార్మికవర్గం, కమ్యూనిస్టులు సైనికులతో కలిసి బ్రిటీష్ ముష్కరులతో పోరాడారు. బొంబాయి వీధులు కార్మికుల, కమ్యూనిస్టుల, సైనికుల రక్తంతో తడిసి ముద్దయ్యాయి. విప్లవకారులు, కమ్యూనిస్టుల పోరాటాలు, వీటికి తోడు మహాత్మాగాంధీ అహింసాయుత పోరాటం ఫలితంగా 1947 ఆగస్టు 15 న దేశం స్వాతంత్ర్యం పొందింది. స్వాతంత్ర్యానంతరం సంస్థానాల విలీనం కొరకు జరిగిన పోరాటంలో కమ్యూనిస్టులు చారిత్రక పాత్ర వహించారు. కశ్మీర్, మైసూరు, తిరువాన్కూరు, కుచ్‌బిహార్, త్రిపుర, మయూర్‌గంజ్, మణిపూర్, భోపాల్ సంస్థానాల విలీనం జరిగింది. హైదరాబాద్ సంస్థాన విలీన సాయుధ పోరాటంలో 4 వేల కమ్యూనిస్టులు వీర మరణం చెందారు.

స్వాతంత్ర్యానంతరం దేశం స్వయం స్వావలంబన కోసం కమ్యూనిస్టులు పోరాడారు. దున్నేవానికే భూమి నినాదాన్ని ముందుకు తెచ్చి భూమి పంపిణీ చేశారు. సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా, భూస్వామ్య, పెత్తందారీ విధానానికి వ్యతిరేకంగా సుదీర్ఘపోరాటంచేసి అశేష త్యాగాలు చేశారు. వర్ణ వివక్ష, సామాజిక పీడనలను అంతంచేసి, ఆర్థిక సమానత్వంకోసం దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించారు. భూ సంస్కరణల చట్టం, బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు వంటి చర్యలకు ఉద్యమించి విజయాలు సాధించారు. ఆర్థిక అసమానతలు అంతంచేసి సోషలిజం కోసం, దోపిడీ రహిత నూతన సమాజం కోసం పోరాడారు. నేటికి దేశ వ్యాపితంగా కార్పొరేట్ వర్గాల దోపిడీని అడుగడుగునా ప్రతిఘటిస్తూ శ్రామిక వర్గం, కష్టజీవులను ఐక్యంచేసి పోరాడుతున్నారు. సోషలిస్టు సమాజ స్థాపనకు అంకితమై పని చేస్తున్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో ఇసుమంత పాత్రలేనివారు, బ్రిటీష్ దొరలకు దాసోహం అని క్షమాభిక్ష కోరినవారు, శాంతిదూత మహాత్మాగాంధీని హత్యచేసిన వారి వారసులు నేడు తాము దేశ భక్తులమని చెప్పుకుంటూ అధికారం పీఠంఎక్కి చరిత్రకు వక్ర భాష్యాలు చెబుతున్నారు. తామే నిజమైన దేశ భక్తులమని ప్రచారం చేస్తున్నారు. ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూని దేశద్రోహిగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నారు. గుజరాతీ జాతీయభావాన్ని దేశమంతా విస్తరించే ప్రయత్నం చేస్తున్నారు. భారతదేశ సెక్యులర్ రాజ్యాంగాన్ని ధ్వంసంచేసి దాని స్థానంలో మనుస్మృతిని తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు. స్వాతంత్ర్యం ముందు ఉన్న సాంస్కృతిక వారసత్వ స్మారక చిహ్నాలను తొలగించాలని యోచిస్తున్నారు. ముస్లిం, క్రైస్తవ మతాలను వ్యతిరేకిస్తూ హిందూమత దురహంకారాన్ని రెచ్చగొడుతున్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటం ద్వారా సంక్రమించిన దేశభక్తి, త్యాగం స్థానంలో స్వార్థపరత్వం, స్వీయ మానసిక ధోరణితో కూడిన చర్యలకు ఉపక్రమిస్తున్నారు. 77 ఏళ్ల స్వాతంత్ర్యకాలంలో దేశం సాధించిన విజయాలను, ఆనాటి కాలమాన పరిస్థితులలో జరిగిన అనేక నిర్ణయాలను తిరగదోడి దేశంలో వివిధ వర్గాల ప్రజల మధ్య అనైక్యతను సృష్టిస్తున్నారు. కోట్లాది సాధారణ ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం నిస్వార్థంగా పోరాడిన గాంధేయవాదులను, జాతీయ నాయకులను, దేశం కోసం తృణప్రాయంగా ప్రాణాలర్పించిన విప్లవకారులను, స్వాతంత్ర్యంకోసం రక్తం చిందించి, దీర్ఘకాలం క్రూర నిర్బంధం ఎదుర్కొన్న కమ్యూనిస్టులను తక్కువచేసి బ్రిటీష్ వారికి పాదాక్రాంతమై క్షమాభిక్ష కోరిన దేశ ద్రోహులకు పెద్ద పీట వేస్తున్నారు.

నేడు బీజేపీ, మతోన్మాదుల పాలనలో దేశం అన్ని రంగాలలో వెనుకబడింది. అవినీతి, ఆశ్రిత పక్షపాతం రాజ్యమేలుతున్నాయి. నిరుద్యోగం పెరిగిపోయింది. మహిళల మానప్రాణాలకు రక్షణలేదు. విద్యా వ్యవస్థ కాషాయీకరణ జరుగుతోంది. శాస్త్రీయ విద్యా బోధన స్థానంలో మూఢ విశ్వాసాలు, జ్యోతిష్యం, వేదాధ్యయనం వంటి వాటిని చొప్పిస్తున్నారు. కార్మికుల హక్కులు హరించి వేశారు. వ్యవసాయం రైతుల చేతుల నుంచి కార్పొరేట్ల హస్తగతమౌతోంది. దేశ అలీనవిధానం స్థానంలో సామ్రాజ్యవాద శక్తుల ఒత్తిడికి లొంగిపోతున్నారు. పారిశ్రామిక రంగం సంక్షోభంలో ఉంది. ఆకలి, దారిద్ర్యం, ద్రవ్యోల్బణం అదుపు తప్పాయి. దేశ స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, సమానత్వం ప్రమాదంలోపడ్డాయి. దేశ స్వాతంత్ర్య పరిరక్షణ ప్రధాన కర్తవ్యంగా నూతన సామాజిక వ్యవస్థ నిర్మాణానికి ప్రజలు పునరంకితం కావాలి. అదే నేటి కర్తవ్యం. త్యాగధనుల స్ఫూర్తితో స్వాతంత్ర్య పరిరక్షణకు ప్రజలందరు కర్తవ్యోన్ముఖులు కావాలి.

సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు
సెల్: 94909 52093

అభివృద్ధి ఎండమావే...!

కృష్ణ ఝా

భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారే అవకాశం దాదాపు మృగ్యమైనట్లే కనపడుతోంది. మన దేశంలో పసిబిడ్డ తల్లి రెండు రోజులుగా ఆకలితో నిర్వేదంగా రోజులు గడపడం సర్వ సాధారణం. పిల్లలకు కనీస ఆహారం లభించే గ్యారంటీలేదు. మరో పక్క దేశీయంగా నిరుద్యోగం 3.2శాతం తగ్గిందని పీరియాడిక్ లేబర్ సర్వే తెలిపింది. 2014-2023 మధ్య 125మిలియన్ ఉద్యోగాలు కల్పించినట్లు ఆర్థికమంత్రి ప్రకటించడం హాస్యాస్పదమైన విషయం. దేశంలో ప్రస్తుతం నిరుద్యోగిత 9.2 శాతమని సీఎమ్ఐఈ తెలిపింది. ఐఎల్ఓ తన తాజా నివేదికలో నిరుద్యోగులలో 83 శాతం మంది యువకులని పేర్కొంది. తాజాగా యూపీలోని పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పరీక్షలో 60,244 ఖాళీల కోసం 16 లక్షలమంది మహిళలు సహా 48 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. యూపీలోని స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌లో 7,500 ఖాళీలకు 24,74,030 దరఖాస్తులు వచ్చాయి. ఇవి కేవలం మచ్చు తునకలే. మోదీ హయాంలో భారతదేశం ఆర్థికశక్తిగా మారుతుందన్న బీజేపీ ప్రభుత్వ ప్రచారం వట్టిబూటకమని రుజువైంది. అభివృద్ధి ప్రచారం ఎండమావిగా ఉంది.

ఈ ఏడాది జూలై 31న విడుదలచేసిన వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, భారతదేశ ప్రధాన రంగాల ఉత్పత్తి వృద్ధి జూన్‌లో 4 శాతానికి క్షీణించిందని పేర్కొంది. కాగా ఇది 20 నెలల్లో మరింత నెమ్మదించింది. ఈ ఏడాది మే నుంచి ఎనిమిది ప్రధాన రంగాల వృద్ధి 2.4 శాతానికి పడిపోయింది. బొగ్గు మినహా వివిధ రంగాలు ఈ ఏడాది జూన్‌లో ఉత్పత్తి వృద్ధిలో తీవ్ర క్షీణతను నమోదు

చేశాయి. ఉక్కు ఉత్పత్తి ఏడు నెలల కనిష్టానికి దిగజారింది. చమురుశుద్ధి ఉత్పత్తి ఐదునెలల్లో మొదటిసారి క్షీణించింది. విద్యుత్ ఉత్పత్తి నాలుగు నెలల కనిష్ట స్థాయి 7.7 శాతానికి దిగజారింది. సహజవాయువు ఉత్పత్తి 13 నెలల కనిష్టానికి చేరింది. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో 40 శాతానికి పైగా ఉన్న కోర్ ఇండస్ట్రీస్ ఇండెక్స్ మే స్థాయి కంటే 3.2 శాతం తక్కువగా ఉంది. ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పన, పరిశ్రమలలో ప్రభుత్వ వ్యయం, నైపుణ్యాభివృద్ధి, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం, ప్రపంచ పారిశ్రామిక ఉత్పాదక శక్తిగా దేశాన్ని కీలకస్థానంలో నిలపడంలో ప్రధాన పాత్రపోషిస్తాయి. మోదీ 10సంవత్సరాల పాలనలో దేశం పారిశ్రామిక, ఉత్పాదకతకు దారితీయలేదు సరికదా, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం, పెట్టుబడులను ఆకర్షించడం - మేక్ ఇన్ ఇండియా ప్రచారం వంటి పథకాలు ప్రారంభానికికూడా నోచుకోలేదు.

దీర్ఘకాలికంగా దేశంలో వేళ్లూనుకునిఉన్న పేదరికం తగ్గింపు, నియంత్రణకు వృద్ధి కచ్చితంగా అవసరం. సరళీకరణ ఆర్థిక విధానాల అమలు అనంతర కాలంలో దేశంలో నెలకొన్న పేదరికాన్ని తగ్గించే విషయంలో కేవలం ఉత్పాదకత ఒక్కటే సరిపోదు. వివిధ రంగాలను వివిధ ప్రాంతాలలో అభివృద్ధి చేయవలసి ఉంది. ముఖ్యంగా అభివృద్ధి అత్యధికంగా ఉండే పట్టణ ప్రాంతాలలో కేంద్రీకృతమై ఉండకూడదు. ఆర్థిక అభివృద్ధి దీర్ఘకాలిక ప్రక్రియ వృద్ధిగా మాత్రమే కాకుండా, నిర్మాణాత్మకతో కూడినదై ఉండాలి. దీని ద్వారా కార్మికులు ఉత్పాదక రంగంతోపాటు ముఖ్యంగా వ్యవసాయం నుండి తయారీ, సేవా రంగాలకు విస్తరిస్తారు. సామాజిక భద్రత, విధానాలు పేదరికాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. మెరుగైన ప్రజా సేవలు పేదలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి వీలు కల్పిస్తాయి. వినియోగదారు వ్యయం, తలసరి ఆదాయం, వార్షిక వృద్ధి రేటు ఆధారంగా పేదరికం వృద్ధిని గణించవచ్చు. 2004-2012 కాలంలో తలసరి వృద్ధిరేటు అధికంగా కాగా, పేదరికం తగ్గుదల మరింతగా పెరిగింది. గత దశాబ్దకాలంగా, తలసరి వృద్ధి రేటు ప్రజలలో పెరుగుతున్న దారిద్ర్యానికి దారితీస్తోంది.

పేదరికం తగ్గింపుకు సంబంధించినంతవరకు గత దశాబ్దంలోనే కాదు, అంతకుముందు దశాబ్దాలలో కూడా భారత ఆర్థిక వ్యవస్థ పెద్ద పజిల్. 1991లో ఆర్థిక సరళీకరణ విధానాలతో మనదేశం వృద్ధి పథంలో నిలిచింది. మూడు దశాబ్దాల కాలంలో వృద్ధిరేటు మందగించడంతో ఆర్థిక వృద్ధి రేటుపై గణనీయంమైన ప్రభాం చూపింది. దేశ జీడీపీలో తయారీ రంగ వాటా పరిణామంలో చెప్పుకోదగిన మార్పు లేదు. వాస్తవంగా, భారతదేశంలో నిర్మాణాత్మక మార్పులకు సేవా రంగం కీలకం. సేవారంగం గత దశాబ్ద కాలంలో తన వాటాను దాదాపు 50 శాతానికి పెంచింది. అయితే తయారీ రంగం ప్రస్తుతం చాలా నిర్వేదంగా ఉంది. ఒక పక్క వేగంగా పెరుగుతున్న పేదరికం, వృద్ధిలో కొనసాగుతున్న పతనం, నిరుద్యోగితతోపాటు నిత్యావసరాల ధరల భారీ పెరుగుదలతో ముడిపడి ఉన్న భారత ఆర్థిక వ్యవస్థకు ఉత్పాదకత రంగం స్తబ్దత మరింత ప్రభావం చూపనుంది.

వైద్యుల ఆందోళన ఉధృతం

- దేశవ్యాప్తంగా సమ్మె
- కోల్‌కతా ఘటనకు నిరసనగా సేవల నిలిపివేత
- భద్రత లేకుండా విధులు నిర్వహించబోమని స్పష్టీకరణ

న్యూఢిల్లీ/కోల్‌కతా: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రికి చెందిన ట్రయినీ వైద్యురాలిపై హత్యాచారం ఘటనకు నిరసనగా వైద్యుల ఆందోళన మరింత ఉధృతమైంది. ఆస్పత్రుల్లో భద్రతపై సోమవారం దేశవ్యాప్త ఆందోళనలకు దిగిన వైద్యులు మంగళవారం కూడా కొనసాగించారు. తాము పని చేసే ప్రదేశాల్లో సరైన భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. 'నో సేఫ్టీ.. నో డ్యూటీ' అంటూ నినదించారు. అత్యవసర సేవలు మినహా విధులకు తిరిగి హాజరయ్యేందుకు నిరాకరించారు. అనేక నగరాల్లో ఓపీ సేవలకు అంతరాయం ఏర్పడింది. ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఫోర్డా) ఎంపిక చేసిన సేవలకు దూరంగా ఉంటామని ప్రకటించింది. కోల్‌కతాలో వైద్యురాలి హత్య అత్యంత అవమానకరమైన ఘటన అని, వైద్యులకు తగిన భద్రత కల్పించాలంటూ కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాకు అసోసియేషన్ లేఖ రాసింది. డ్యూటీలో ఉన్న మహిళా వైద్యురాలి హత్యకు బాధ్యులైన అధికారులు అందరూ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. నిరసన తెలుపుతున్న వైద్యులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని, ఈ కేసులో సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. వైద్యుల ఆందోళన తీవ్రత కోల్‌కతా నగరంలో ఎక్కువగా ఉంది. దీంతో నగరంలోని చాలా ఆస్పత్రుల్లో చికిత్స సేవలు నిలిచిపోయాయి. నిరసనల కారణంగా అనేక మంది రోగులు, బంధువులు అసౌకర్యానికి గురవుతున్నామని చెబుతున్నారు.

బెంగాల్ వ్యాప్తంగా భారీ నిరసనలు

మహిళా వైద్యురాలిపై హత్యాచారం ఘటనను నిరసిస్తూ, ఆమెకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పశ్చిమ బెంగాల్ అంతటా జూనియర్ వైద్యులు విధులు బహిష్కరించి సమ్మె కొనసాగించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి అన్ని ప్రభుత్వాస్పత్రుల్లోని ఔట్ పేషెంట్ విభాగాల (ఓపీడీ) వద్ద రోగుల క్యూలు బారులుతీరి కనిపించడంతో సీనియర్ వైద్యులు రోగులకు సేవలందించేందుకు చర్యలు చేపట్టారు. అయితే రద్దీని పరిష్కరించలేకపోవడంతో ఆరోగ్య సంరక్షణ సేవలపై ప్రభావం పడింది. మహిళా వైద్యురాలి హత్యపై న్యాయ విచారణ, ఆర్‌జీ కర్ వైద్య కళాశాల నుంచి సీనియర్ అధికారులను తొలగించాలంటూ ఆందోళనకు దిగిన జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. ఆగస్టు 14వ తేదీలోగా కేసు విచారణను పూర్తి చేయాలని కోల్‌కతా పోలీసులకు గడువు విధించారు. 'మా డిమాండ్లు నెరవేరే వరకు విధుల బహిష్కరణ, నిరసన కొనసాగుతుంది. మా డిమాండ్ల గురించి మేము చాలా స్పష్టంగా చెప్పాం. ఈ సంఘటనపై న్యాయ విచారణను మేము కోరుకుంటున్నాం' అని నిరసనకారుల్లో ఒకరైన జూనియర్ డాక్టర్ స్పష్టం చేశారు. వారికి ఆదివారం వరకు గడువు ఎందుకు అవసరం? బుధవారంలోగా విచారణ పూర్తి చేయాలని పోలీసులను కోరుతున్నామని ఆయన తెలిపారు. కాగా, దేశ రాజధాని ఢిల్లీలో రెసిడెంట్ వైద్యుల సమ్మె రెండో రోజుకు చేరుకోవడంతో ఢిల్లీలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఎంపిక చేసిన సేవలను నిలిపివేయడంతో అనేక ఆస్పత్రులు మూతపడ్డాయి. పెద్ద సంఖ్యలో వైద్యులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహారాష్ట్రలోని రెసిడెంట్ వైద్యులు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆస్పత్రుల్లో అన్ని ఎంపిక చేసిన సేవలు నిలిచిపోయాయి. అత్యవసర సేవలు నిరంతరాయంగా కొనసాగుతాయని మహారాష్ట్ర స్టేట్ అసోసియేషన్ ఆఫ్ రెసిడెన్షియల్ డాక్టర్స్ (సెంట్రల్-మార్డ్) అధ్యక్షుడు డాక్టర్ ప్రతీక్ దేబాజే తెలిపారు.

ఉత్తర ప్రదేశ్‌లో ఓపీడీ గది తలుపులు బద్దలు

ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలోని కింగ్ జార్జ్ వైద్య విశ్వవిద్యాలయంలో వైద్యులు నిరసనకు దిగడం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. నిరసన తెలుపుతున్న వైద్యులు మంగళవారం ఉదయం గుమిగూడి సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అయితే చికిత్స అందించాలని రోగులు, వారి బంధువులు డిమాండ్ చేశారు. దీంతో అక్కడి ఒక్కసారిగా ఆందోళనకర వాతావరణం నెలకొంది. కొందరు రోగుల బంధువులు వైద్యం అందించాలంటూ మూసి ఉన్న ఓపీడీ గది తలుపులు బద్దలుకొట్టారు. రాజధాని లక్నోతో పాటు గోరఖ్‌పూర్, ఆగ్రా, ఝాన్సీ, కాన్పూర్ వంటి నగరాలు, అలాగే వారణాసి, గ్రేటర్ నోయిడాల్లో రాష్ట్ర ఆరోగ్య విశ్వవిద్యాలయ ఆస్పత్రుల్లో కూడా రెండవ రోజు సమ్మె కొనసాగింది. రాంచీలోని ప్రభుత్వ అధ్వర్యంలోని రాజేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) లోని జూనియర్ వైద్యులు మంగళవారం ఓపీడీ సేవలు, ఎంపిక శస్త్రచికిత్సలను బహిష్కరించి ఆందోళనను ప్రారంభించారు. 'దాదాపు 200 మంది వైద్యులు ఆందోళనలో చేరారు. సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు కూడా మా ఆందోళనకు మద్దతు ఇచ్చారు. మా నిరసన అత్యవసర సేవలను మినహాయించింది, ఎందుకంటే ఏ రోగి కూడా బాధపడకూడదని మేము కోరుకుంటున్నాం' అని జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు అంకిత్ కుమార్ తెలిపారు. జైపూర్‌లోని అతిపెద్ద ప్రభుత్వ సవాయి మాన్ సింగ్ ఆస్పత్రితో సహా ప్రభుత్వ సౌకర్యాలలో వైద్య సేవలు నిలిచిపోయాయి. అయితే అత్యవసర సేవలపై ఎలాంటి ప్రభావం లేదని జేఏఆర్‌డీ అధ్యక్షుడు డాక్టర్ మనోహర్ సియోల్ తెలిపారు. ఈ ఘటనకు వ్యతిరేకంగా రెసిడెంట్ డాక్టర్లు కూడా ప్రదర్శన నిర్వహించారు. ఎస్ఎంఎస్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుశీల్ భాటి మాట్లాడుతూ పనులు సజావుగా సాగేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు.

త్వరలో కర్నాటక మంత్రివర్గ విస్తరణ

బెంగళూరు: కర్నాటక మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ చేయాలని అధిష్ఠానం సూచించినట్టు తెలుస్తోంది. ఐదుగురిని కేబినెట్ నుంచి తొలగించి ఆరుగురి ద్వారా భర్తీ చేయాలని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఆప్తుడిగా ముద్రపడిన నగరాభివృద్ధిశాఖ మంత్రి బైరతి సురేశ్, ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, అబ్కారి మంత్రి ఆర్‌బీ తిమ్మాపుర, సహకారశాఖ మంత్రి రాజణ్ణ, ప్రజాపాలన, హజ్‌శాఖ మంత్రి రహీంఖాన్‌ను తొలగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే నాగేంద్ర రాజీనామాతో ఒక స్థానం ఖాళీగా ఉంది. వీటితో కలిపి ఆరు స్థానాలు భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయి. అయితే భద్రావతి ఎమ్మెల్యే సంగమేశ్‌కు కేబినెట్‌లో చోటు ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా భద్రావతిలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణ జరిగితే సంగమేశ్ మంత్రి అవుతారన్నారు.

2036 నాటికి దేశ జనాభా 152.2 కోట్లు

న్యూఢిల్లీ: మన దేశంలో స్త్రీ, పురుష సమానత్వంలో ఆశాజనక ధోరణి కనిపిస్తున్నదని కేంద్ర గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ తెలిపింది. 2036 నాటికి ప్రతి 1,000 మంది పురుషులకు 952 మంది మహిళలు ఉంటారని అంచనా వేసింది. 2011నాటి లెక్కల ప్రకారం ప్రతి వెయ్యి మంది పురుషులకు 943 మంది మహిళలు ఉండేవారని తెలిపింది. 2011నాటి జనాభాలో మహిళల సంఖ్యతో పోల్చితే... 2036లో ఎక్కువ మంది మహిళలు ఉంటారని అంచనా వేసింది. 2011నాటి జనాభాలో 48.5 శాతం మంది మహిళలు ఉన్నారని, 2036 నాటికి జనాభా 152.2 కోట్లకు చేరుతుందని, దీనిలో మహిళల జనాభా 48.8 శాతానికి పెరుగుతుందని వివరించింది. 15 ఏళ్ల లోపు బాలల సంఖ్య 2011లో కన్నా 2036లో తగ్గుతుందని, సంతానోత్పత్తి తగ్గడమే దీనికి కారణమని పేర్కొంది.

విజయవంతంగా ఎంపీఏటీజీఎం పరీక్ష

జైసల్మేర్: డీఆర్డీవో మంగళవారం కీలక పరీక్ష చేపట్టింది. మేడిన్ ఇండియాలో భాగంగా తయారు చేసిన మాన్ పోర్టబుల్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్(ఎంపీఏటీజీఎం)ను విజయవంతంగా పరీక్షించింది. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో ఉన్న ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఈ పరీక్ష జరిగింది. డీఆర్డీవో అధికారులు దీనికి సంబంధించిన వీడియో విడుదల చేశారు. ఎంపీ ఏటీజీఎం వెపన్ సిస్టమ్‌ను స్వదేశీయంగా డిజైన్ చేశారు. డీఆర్డీవో దీన్ని అభివృద్ధి చేస్తోంది. వేర్వేరు ఫ్లయిట్ ప్రదేశాల్లో ఆ లక్ష్యంతో గైడెడ్ మిస్సైల్ పనిచేస్తున్నట్లు గుర్తించారు.

అర్ధరాత్రి మహిళల నిరసన

కోల్‌కతా: తమ డిమాండ్లు నెరవేరే వరకు, న్యాయం జరిగేవరకు సమ్మెను విరమించబోమని ఇప్పటికే ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ తెలిపింది. నో సేఫ్టీ-నో డ్యూటీ అంటూ నిరసనకారులు ప్లకార్డులు ప్రదర్శించారు. వీరితోపాటుగా కోల్‌కతా, బెంగాల్‌లోని ఇతర ప్రాంతాలకు చెందిన మహిళలు వినూత్న ఆందోళనకు సిద్ధమవుతున్నారు. వారంతా బుధవారం అర్ధరాత్రి నిరసన చేపట్టాలని నిర్ణయించారు. 'స్వాతంత్ర్యం వచ్చిన అర్ధరాత్రి మహిళల స్వాతంత్ర్యం కోసం' పేరిట రేపు రాత్రి 11.55 గంటలకు దీనిని ప్రారంభించనున్నారు. ఎక్కడెక్కడ నిరసనలు చేపట్టాలో ఆయా ప్రాంతాలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. దీనికి సంఘీభావంగా పురుషులు కూడా ఇందులో భాగం కావాలని నిర్ణయించుకున్నారు. స్వస్తికా ముఖర్జీ, చుర్నీ గంగూలీ, ప్రతిమ్ డి గుప్తా వంటి సినీ ప్రముఖులు మద్దతుగా రానున్నారు. సోమవారం బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. వారంలోగా కేసును పరిష్కరించాలని పోలీసులకు అల్టిమేటం జారీచేశారు.

బెయిల్ తిరస్కరణ ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే

సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: చట్టవ్యతిరేక కార్యకలాపాలు, తదితర ప్రత్యేక చట్టాల కింద జరిగే నేరాలకు బెయిల్ నియమం వర్తిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. న్యాయస్థానాలు తగిన కేసుల్లోనూ బెయిల్ తిరస్కరించడం ప్రారంభిస్తే అది ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం పేర్కొంది. ప్రాసిక్యూషన్ ఆరోపణలు చాలా తీవ్రమైనవి అయినా... చట్టం ప్రకారం బెయిల్‌ను పరిగణించడం కోర్టు విధి అని పేర్కొంది. బెయిల్ అనేది నియమమని, జైలు నుంచి మినహాయింపు అని తెలిపింది. ఇది ప్రత్యేక చట్టాలకు సైతం వర్తిస్తుందని చెప్పింది. న్యాయస్థానాలు బెయిల్ నిరాకరించడం ప్రారంభిస్తే రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద ఇచ్చిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినట్టేనని ధర్మాసనం అభిప్రాయపడింది. జలాలుద్దీన్ ఖాన్ అనే వ్యక్తిని బెయిల్‌పై విడుదల చేసేందుకు కోర్టు అంగీకరించింది. జలాలుద్దీన్ ఖాన్‌పై ఉపా చట్టంలో అనేక సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. అతను నిషేధిత సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా సభ్యులకు తన ఇంటి పై అంతస్తును అద్దెకు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుడు నేరపూరిత కుట్ర, ఉగ్రవాదం, హింసాత్మక చర్యలకు పాల్పడేందుకు పన్నిన కుట్రలో భాగమయ్యాడని ఎన్ఐఏ ఆరోపించింది. నిందితులు ఫుల్వారీ షరీఫ్ (పాట్నా)లోని అహ్మద్ ప్యాలెస్‌ను అద్దెకు తీసుకొని వసతి ఏర్పాటు చేసుకున్నారని, భవనాన్ని హింసాత్మక చర్యలకు, సమావేశాల నిర్వహణకు, శిక్షణకు ఉపయోగించినట్లుగా ఆరోపణలున్నాయి. 2022లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీహార్ పర్యటన సందర్భంగా అలజడి సృష్టించేందుకు నిందితులు కుట్ర పన్నినట్లుగా బీహార్ పోలీసులకు సమాచారం అందింది. ఆ తర్వాత 11 జులై 2022న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు.

చెల్లెలిపై భార్యను పోటీ పెట్టడం తప్పే

అజిత్ పవార్

ముంబై: లోక్‌సభ ఎన్నికల్లో బారామతి స్థానం నుంచి సుప్రియ సూలేపై తన భార్య సునేత్ర పవార్‌ను పోటీకి దింపడం తప్పేనని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత అజిత్ పవార్ వ్యాఖ్యానించారు. రాజకీయాలను ఇంటి వ్యవహారాల్లోకి రానివ్వకూడదని పేర్కొన్నారు. త్వరలో మహారాష్ట్ర ఎన్నికలు జరగనున్న వేళ రాష్ట్రవ్యాప్తంగా 'జన సమ్మాన్ యాత్ర' నిర్వహిస్తున్న ఆయన... మహిళలకు నెలకు రూ.1500 అందజేసే పథకానికి విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఓ న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అజిత్ పవార్ ఈ వ్యాఖ్యలు చేశారు. గతేడాది ఎన్సీపీలో చీలిక వచ్చిన సంగతి తెలిసిందే. అజిత్ పవార్ నేతృత్వంలోని కొంతమంది ఎమ్మెల్యేలు శివసేన- బీజేపీ ప్రభుత్వంలో చేరిపోయారు. అంతేకాకుండా అజిత్ పవార్ నేతృత్వంలోని పార్టీనే అసలైన పార్టీ అని ఎన్నికల సంఘం పేర్కొంది ఈ క్రమంలోనే శరద్‌పవార్ కుమార్తె అయిన సుప్రియా సూలేపై అజిత్ పవార్ భార్య సునేత్ర పోటీ చేశారు. అయితే, సుప్రియ చేతిలో సునేత్ర ఓటమి చవిచూశారు. దీంతో ఆమెను రాజ్యసభకు నామినేట్ చేశారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న వేళ అజిత్ పవార్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'నా సోదరీమణులంటే నాకు ఎంతో ఇష్టం. అయినా ఇంటి వ్యవహారాల్లోకి రాజకీయాలను రానివ్వకూడదు. సుప్రియపై పోటీకి నిలిపి తప్పు చేశాను. అలా జరిగి ఉండాల్సింది కాదు. అయినా ఎన్సీపీ పార్లమెంటరీ పార్టీ బోర్డులో తీసుకున్న నిర్ణయం కారణంగా పోటీకి దింపాల్సి వచ్చింది. అందుకు చింతిస్తున్నా' అని అజిత్ వ్యాఖ్యానించారు. రక్షాబంధన్ సందర్భంగా సుప్రియను కలుస్తారా అని విలేకరి ప్రశ్నించగా... ఆమె ప్రస్తుతం వేరే పర్యటనలో ఉన్నారని, ఒకవేళ ఒకేచోట ఉన్నట్లయితే తప్పకుండా కలుస్తానని చెప్పారు.

స్వేచ్ఛగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలి

హర్యానా అధికారులకు ఈసీ సూచన

చండీగఢ్ : అసెంబ్లీ ఎన్నికల సమయంలో పూర్తి నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగేలా క్షేత్ర స్థాయిలో వ్యవహరించాలని హర్యానాలోని జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసు సూపరింటెండెంట్లను ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికల సమయంలో ప్రలోభాలపై దృష్టి సారించిన కమిషన్... అక్రమ మద్యం, నగదు, మాదక ద్రవ్యాల ప్రవాహాన్ని అరికట్టేందుకు సమన్వయంతో పని చేయాలని దర్యాప్తు సంస్థలను ఆదేశించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ నేతృత్వంలోని ఎన్నికల సంఘం (ఈసీ) బృందం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది చివరిలో జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం ఎన్నికల సంసిద్ధతను సమీక్షించేందుకు బృందం రెండు రోజుల హర్యానా పర్యటనలో ఉంది. 90 మంది సభ్యుల హర్యానా అసెంబ్లీ పదవీకాలం నవంబరు 3తో ముగియనుంది. ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధులతో కూడిన ఈసీ బృందం సోమవారం చండీగఢ్‌కు చేరుకుంది. ఈ పర్యటనలో బృందం ఆప్, బీజేపీ, సీపీఎం, కాంగ్రెస్, ఇండియన్ నేషనల్ లోక్ దళ్ (ఐఎన్ఎల్‌డీ), జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) వంటి జాతీయ, రాష్ట్ర పార్టీల ప్రతినిధులతో సమావేశమైంది. ప్రభుత్వ యంత్రాంగం దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకుని స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని, సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో తగిన బలగాలను మోహరించాలని, పోలింగ్ కేంద్రాల మధ్య దూరాన్ని తగ్గించాలని, మహిళా ఓటర్లు, వృద్ధులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ రాజకీయ పార్టీలు అనేక సమస్యలను లేవనెత్తాయి. కాగా, పార్టీల ప్రతినిధుల సూచనలు, ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్నామని, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, భాగస్వామ్య, సమ్మిళిత, శాంతియుతంగా, ప్రేరేపణ రహిత ఎన్నికల నిర్వహణకు కట్టుబడి ఉన్నామని ఈసీ హామీ ఇచ్చింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నప్పుడు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడంపై పార్టీల ఆందోళనలకు సంబంధించి, జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసు సూపరింటెండెంట్లు, రాష్ట్ర పరిపాలన పూర్తి నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఈసీ ఆదేశించింది. తప్పుడు వార్తలను కట్టడి చేసేందుకు సోషల్ మీడియాను పర్యవేక్షించాలని ఆదేశాలు కూడా జారీ చేశారు. మంగళవారం ఈ బృందం రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్, భారతీయ రిజర్వు బ్యాంకు, హర్యానా పోలీస్, ఆదాయపు పన్ను, ఈడీతో సహా దాదాపు 20 కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలతో సమీక్షా సమావేశం నిర్వహించింది. ఎన్నికల కోసం 20,629 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని, 2019 ఎన్నికలతో పోలిస్తే 817 పోలింగ్ కేంద్రాలు పెరిగినట్లు హర్యానా ప్రధాన ఎన్నికల అధికారి పంకజ్ అగర్వాల్ తెలిపారు.

రూ.54 కోట్లు దోచేసింది

జీఎస్టీ అధికారిణి అక్రమాలు

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఓ జీఎస్టీ అధికారి అక్రమాలు బయటపడ్డాయి. ఆమె ఏకంగా వందల నకిలీ కంపెనీలు సృష్టించి... ముగ్గురు న్యాయవాదులు సహా ఏడుగురితో బృందంగా ఏర్పడి ఏకంగా రూ.54 కోట్ల ప్రభుత్వ ధనం దోచేసింది. తాజాగా ఢిల్లీ ఏసీబీ రంగంలోకి దిగడంతో అధికారులే దిగ్భ్రాంతికి గురయ్యేలా కుంభకోణం వెలుగులోకి వచ్చింది. బబితా శర్మ ఢిల్లీలో జీఎస్‌టీ అధికారిగా పనిచేస్తున్నారు. ఆమెను కొన్నేళ్ల కిందట ఆఫీస్‌లోని వార్డ్ 22కు బదిలీ చేశారు. ఇది జరిగిన కొన్ని రోజుల్లోనే 50కిపైగా సంస్థలు జీఎస్టీ వార్డ్ 6 నుంచి 22కు బదిలీ చేయాలని దరఖాస్తు చేసుకొన్నాయి. వీటికి వెంటనే ఆమోదం లభించింది. ఆమె 2021-2022 సమయంలో 96 తప్పుడు సంస్థలకు 400 రీఫండ్లు ఆమోదించారు. వీటి విలువ రూ.35.51 కోట్లు. ఆమె తొలి సంవత్సరం కేవలం రూ.7 లక్షల మాత్రమే రీఫండ్‌ను ఆమోదించింది. ఆ తర్వాత మిగిలిన మొత్తానికి ఆమోద ముద్ర వేసింది. వాస్తవానికి రీఫండ్ల దరఖాస్తులు వచ్చిందే ఆలస్యంగా... వాటికి మూడు రోజుల్లోనే ఆమోదం లభించింది.

ఈ వ్యవహారంతో జీఎస్‌టీ విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ అప్రమత్తమై బృందాలను పంపింది. దీంతో తమ కార్యాలయంలోనే కుంభకోణం జరుగుతోందని ఆ బృందాలు గుర్తించాయి. కేసును ఏసీబీకి బదిలీ చేశారు. ఎటువంటి కొనుగోళ్లు లేకుండానే కాగితాలపై వ్యాపారం చేసినట్లు చూపించి... వందల కొద్దీ సంస్థలు రూ.718 కోట్లకు ఇన్‌వాయిస్‌లు సమర్పించినట్లు అధికారులు గుర్తించారు. వీటికి సంబంధించి ఎటువంటి తనిఖీలు చేయకుండానే రీఫండ్లు జారీ చేసినట్లు ఏసీబీ గుర్తించింది.

సరిహద్దుల్లో చొరబాటుదారుడి కాల్చివేత

చండీగఢ్: రాబోయే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సరిహద్దుల్లో భారత సైన్యం మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. తాజాగా పంజాబ్ సరిహద్దుల్లో ఓ పాకిస్థానీ చొరబాటుదారుడు భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నిస్తుండగా భద్రతా బలగాలు అతనిని మట్టుబెట్టాయి. ఈ విషయాన్ని బీఎస్ఎఫ్ వెల్లడించింది. ప్రస్తుతం సరిహద్దుల్లో హై అలర్ట్ అమలులో ఉందని బీఎస్ఎఫ్ అధికారి ఒకరు తెలిపారు. సోమవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో తరన్‌తారన్ జిల్లాలోని దాల్ గ్రామం వద్ద అంతర్జాతీయ సరిహద్దును దాటి కంచె సమీపంలోకి వస్తున్న వ్యక్తి కనిపించాడని ఆయన తెలిపారు. అప్పుడు విధుల్లో ఉన్న బీఎస్ఎఫ్ సిబ్బంది చొరబాటుదారునితో తిరిగి వెళ్లిపోవాలని సూచించారు. అయితే అతను అధికారుల సూచనలు వినకుండా సరిహద్దు భద్రతా కంచె వైపు వస్తూనే ఉన్నాడు. ప్రమాదాన్ని పసిగట్టిన డ్యూటీలోని సైనికులు ఆ చొరబాటుదారునిపై కాల్పులు జరిపారు. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. భారత సైన్యం మరోమారు చొరబాటుదారుడియత్నాన్ని విజయవంతంగా తిప్పికొట్టిందని ఆయన పేర్కొన్నారు. కాగా పంజాబ్‌లోని 553 కి.మీ. పొడవైన భారత్-పాకిస్తాన్ సరిహద్దుల్లో హై అలర్ట్ కొనసాగుతోంది.

బెంగళూరులో బస్సు బీభత్సం

బెంగళూరు: ఐటీ హబ్ బెంగళూరులో ఓ బస్సు బీభత్సం సృష్టించింది. బైకులు, కార్లను ఢీ కొట్టి భయాందోళన కలిగించింది. ఘటనలో ప్రాణ నష్టం జరగలేదు గానీ... ఒకరు గాయపడ్డారు. బైకులు, కార్లు మాత్రం ధ్వంసమయ్యాయి. బస్సు అద్దం పగిలిపోయింది. ఆ వీడియోను సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బస్సు డ్రైవర్ తీరును నెటిజన్లు ఏకీపారేస్తున్నారు. రద్దీగా ఉండే బెంగళూరులో వోల్వో బస్సు మెల్లిగా వెళుతుంది. బస్సు ముందు కార్లు, బైకులు ఉన్నాయి. ఫస్ట్ వీడియో చూస్తే బస్సు డ్రైవర్ నియంత్రణలో ఉన్నట్లు అనిపిస్తోంది. వీడియో 33 సెకన్లు దాటిన తర్వాత డ్రైవర్ బీభత్సం కనిపిస్తోంది. డ్రైవర్ బ్రేక్ వేయాల్సింది పోయి... ఎక్స్ లెటర్ నొక్కి ఉంటాడు. ముందు బైక్‌ను ఢీ కొనడంతో అతను పడిపోతాడు. తర్వాత మరో బైక్, కారును ఢీ కొంటాడు. అప్పటికీ బస్సు కంట్రోల్‌లోకి రాదు. ఓ కారును ఢీ కొంటూ ముందుకు తీసుకెళతాడు. ఆ కారు మలుపు తిరుగుతోంది. డ్రైవర్ వద్దకు కండక్టర్ వస్తాడు. బ్రేక్ వెయ్యమని చెబుతాడు. ముందు కారు యూ టర్న్ తిరిగి ఉండగా బస్సును ఎలాగోలా ఆపుతాడు. బస్సు నుంచి డ్రైవర్, కండక్టర్, ప్రయాణికులు దిగుతారు. తర్వాత బస్సు లోపలికి డ్రైవర్ వచ్చి, ఫోన్ తీసుకునే విజువల్ స్పష్టంగా కనిపిస్తోంది. అతని వద్దకు బైకర్లు, కారు ఓనర్లు వస్తారు. ఏం డ్రైవింగ్ చేస్తున్నావని నిలదీస్తారు. బస్సు డ్రైవర్ కాస్త స్పృహతో వ్యవహరిస్తే ప్రమాదం జరిగేది కాదు. డ్రైవర్ తీరును నెటిజన్లు తీవ్రంగా ఖండిస్తున్నారు.

స్పామ్ కాల్స్ తక్షణమే ఆపండి

టెల్కోలకు ట్రాయ్ కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ: అన్ రిజిస్టర్డ్ టెలీ మార్కెటర్ల నుంచి ప్రమోషనల్ కాల్స్, ప్రీ రికార్డెడ్ లేదా కంప్యూటర్ జనరేటెడ్ కాల్స్‌ను తక్షణమే నిలిపివేయాలని టెలికాం కంపెనీలకు ట్రాయ్ ఆదేశాలు జారీ చేసింది. తక్షణమే ఈ ఆదేశాలు అమలుచేయాలని సూచించింది. స్పామ్ కాల్స్‌పై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు ఇచ్చింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అన్‌రిజిస్టర్డ్ టెలీ మార్కెటర్ల నుంచి వస్తున్న కాల్స్‌పై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆయా అన్ రిజిస్టర్డ్ టెలీమార్కెటర్ల డేటాను సమర్పించాలంటూ టెల్కోలకు ట్రాయ్ ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలోనే మంగళవారం ఆ తరహా కాల్స్‌ను తక్షణం నిలిపివేయాలని సూచించింది. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా ఈ తరహా కాల్స్ చేస్తే రెండేళ్ల పాటు యాక్సెస్‌ను నిలిపివేస్తామని హెచ్చరించింది. ఆ సంస్థను రెండేళ్ల వరకు బ్లాక్ లిస్ట్‌లో పెడతామని పేర్కొంది. తక్షణ ఆదేశాలు పాటిస్తూనే స్పామ్ కాల్స్‌పై ఏమేం చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని టెల్కోలను ట్రాయ్ ఆదేశించింది. ఎప్పటిలానే ప్రతినెలా ఒకటో తేదీ, 16వ తేదీన సంబంధిత డేటా సమర్పించాలని తెలిపింది. ఈ అంశంపై గతవారం జియో, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్, వొడాఫోన్ ఐడియా, టాటా టెలీ సర్వీసెస్ వంటి మొబైల్ కంపెనీల చీఫ్ రెగ్యులేటరీ ఆఫీసర్లతో ట్రాయ్ చీఫ్ సమావేశమయ్యారు.

రామ్‌దేవ్ బాబాపై ధిక్కరణ కేసు మూసివేత



న్యూఢిల్లీ: యోగా గురు రామ్‌దేవ్ బాబాకు భారీ ఊరట లభించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలు రూపొందించారని పతంజలి ఆయుర్వేద్ ఎండీ ఆచార్య బాలకృష్ణ, యోగా గురు బాబా రామ్‌దేవ్‌పై నమోదైన ధిక్కరణ కేసును సుప్రీంకోర్టు మూసివేసింది. ఈ ప్రకటనలకు సంబంధించి రామ్ దేవ్‌బాబా, ఎండీ ఆచార్య బాలకృష్ణ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పిన విషయం తెలిసిందే.

ఇకపై అలాంటి యాడ్స్ ఇవ్వబోమని కోర్టుకు విన్నవించారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీం ధర్మాసనం... వారిపై ధిక్కరణ కేసు మూసివేసింది. కోవిడ్ వ్యాక్సినేషన్, అల్లోపతికి వ్యతిరేకంగా పతంజలి ప్రచారం చేసిందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆరోపించింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అమానుల్లాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ కేసుపై మే 14న తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం... మంగళవారం వెలువరించింది. కోర్టు ధిక్కరణ కేసును ముగిస్తూ తీర్పు వెలువరించింది. అయితే, తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని న్యాయస్థానం హెచ్చరించింది.

మొబైల్ సెప్టిక్ ట్రీట్‌మెంట్ యూనిట్లకు కృషి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: మల బురద శుద్ధి సమస్యను పరిష్కరించేందుకు కసరత్తు చేస్తున్నట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రుడు తెలిపారు. పారిశుద్ధ్య రంగంలో వినూత్న మార్పులు, సరికొత్త పరిష్కారాలను అన్వేషిస్తూ మల బురదను శుద్ధి చేయగలిగిన మొబైల్ సెప్టిక్ ట్రీట్‌మెంట్ యూనిట్‌లను రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి జరుగుతుందన్నారు. ఏ ప్రాంతంలోనైనా సమర్ధవంతంగా పని చేసేలా రూపొందించిన ఈ యూనిట్ పనితీరును మంగళవారం మంగళగిరి తాడేపల్లి పురపాలక సంస్థ పరిధిలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గంధం చంద్రుడుకు సంబంధింత సిబ్బంది వివరిస్తూ ఈ యూనిట్ గంటకు 6 వేల లీటర్లను శుద్ధి చేయగల అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉంటుందని అన్నారు. మొబైల్ సెప్టిక్ ట్రీట్‌మెంట్ యూనిట్ సేకరించిన మల బురదను శుద్ధి చేసి స్వచ్ఛమైన నీరు, కంపోస్ట్‌గా విడగొడుతుందన్నారు. ఇది పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. మొబైల్ సెప్టిక్ ట్రీట్‌మెంట్ యూనిట్‌ల ఆవశ్యకతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం జిల్లాకు రెండు వంతున మనకు కేటాయించిందని, టెండర్ ప్రక్రియను పూర్తి చేసి వాటిని అందుబాటులోకి తీసుకు రావాల్సి ఉందని వివరించారు.

నిర్వహణ లోపంతోనే గేటు విరిగింది

తుంగభద్ర డ్యామ్ పరిశీలించిన సీపీఐ నేతలు



విశాలాంధ్ర-ఉరవకొండ: నిర్వహణ లోపం వల్లే తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోయిందని... దీనికి తుంగభద్ర బోర్డుతోపాటు కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) బాధ్యత వహించాలని సీపీఐ డిమాండ్ చేసింది. మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు డి.జగదీశ్, అనంతపురం జిల్లా కార్యదర్శి సి జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున తుంగభద్ర డ్యామ్‌ను సందర్శించారు. వరద ఉధృతికి 19వ గేటు కొట్టుకుపోయి నీరు వృథాగా నదిలో కలిసిపోతుండటాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తుంగభద్ర డ్యామ్ బోర్డు నిర్లక్ష్యం కారణంగా డ్యామ్ పరిధిలోని ఆంధ్ర, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలలో 11 లక్షల ఎకరాలలో సాగు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు 65%, కర్నాటక రాష్ట్రానికి 35% భాగస్వామిగా ఉన్న తుంగభద్ర డ్యామ్ నిర్వహణ లోపం వల్లే ప్రమాదం జరిగిందన్నారు. ఐదు సంవత్సరాల క్రితమే డ్యామ్ గేట్లకు భద్రత లేదని నిపుణులు అనేకసార్లు హెచ్చరించినప్పటికీ బోర్డు యాజమాన్యం గానీ, సీడబ్ల్యూసీ గానీ స్పందించలేదన్నారు. కరువు ప్రాంతాలైన అనంతపురం, కర్నూలు జిల్లా రైతులకు తుంగభద్ర డ్యామ్ జీవనాడిగా ఉందన్నారు. ఈ సంవత్సరం జూన్, జులైలో వర్షాలు బాగా కురవడంతో తుంగభద్ర డ్యామ్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరిందని... దీనివల్ల పెద్ద ఎత్తున ఆయకట్టు రైతులు నార్లు పోసుకొని సాగునీటి కోసం ఎదురుచూస్తున్న తరుణంలో దురదృష్టకరంగా గేటు కొట్టుకుపోయి దాదాపు 60 టీఎంసీల నీరు వృథాగా నదిలోకి పోవడం అత్యంత బాధాకరమన్నారు. ఒకవైపు వర్షాలు రాక తీవ్రమైన కరువు పరిస్థితులతో రైతులు కొట్టుమిట్టాడుతున్నారని మరోవైపు పాలకులు ఉన్న నీటిని సద్వినియోగం చేసి రైతులకు అందించడంలో ఘోరంగా విఫలం చెందారని తెలిపారు. తుంగభద్ర గేటు కొట్టుకుపోవడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) కారణమని వారు పేర్కొన్నారు. ఏపీలో అన్నమయ్య డ్యామ్ కూడా నిర్వహణ లోపం వల్ల కొట్టుకుపోయిందన్నారు. హెచ్‌ఎల్‌సీ కాలువను ఆధునీకరించి... సమాంతర కాలువ చేపట్టాలని సీపీఐ అనేక ఉద్యమాలు చేసినప్పటికీ పాలకులు మాత్రం స్పందించలేదన్నారు. ఆ పని చేసి ఉంటే ఈరోజు తుంగభద్ర డ్యామ్‌కి సంబంధించిన నీరు వృథా అయ్యేది కాదన్నారు. డ్యామ్ గేటు కొట్టుకుపోవడం వల్ల అనంతపురం, కర్నూలు జిల్లాలో సాగునీటితో పాటు తాగునీటి కూడా కష్టాలు ఏర్పడ్డాయన్నారు. సెప్టెంబర్, అక్టోబర్ మాసాలలో వర్షాలు వస్తాయో లేదో కూడా తెలియని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ఉమ్మడి రాష్ట్రాల్లో ఉన్న ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ చూపి పర్యవేక్షణ చేపట్టాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు.

మరమ్మతులు చేపట్టండి...మంత్రి నిమ్మలకు వినతి

తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడం వల్ల అనంతపురం, కర్నూలు జిల్లా రైతుల తీవ్రంగా నష్టపోయారని... సాగునీటికి తాగునీటికి కష్టాలు ఏర్పడ్డాయని యుద్ధ ప్రాతిపదికన విరిగిపోయిన డ్యామ్ గేటుకు మరమ్మతులు చేపట్టి... నీటి వృథాను అరికట్టాలని కోరుతూ సీపీఐ నేతలు రాష్ట్ర జల వనరులు శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కలిసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మంత్రి డ్యామ్ పరిశీలనకు వచ్చిన సందర్భంగా అక్కడే ఉన్న సీపీఐ నేతలు కలిశారు. డ్యామ్‌ను పరిశీలించిన వారిలో సీపీఐ ఉరవకొండ కార్యదర్శి మల్లికార్జున, పార్టీ జిల్లా నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్లకు కోటి విరాళం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న అన్న క్యాంటీన్లకు శ్రీలక్ష్మీ వెంకటేశ్వర డెవలపర్స్ సంస్థ కోటి రూపాయల విరాళం అందించింది. గుంటూరుకు చెందిన ఎస్.ఎల్.వి.డెవలపర్స్ అధినేత పి.శ్రీనివాసరాజు సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి కోటి రూపాయల చెక్కును అందించారు. రాబోయే ఐదేళ్ల పాటు అన్న క్యాంటీన్‌కు కోటి రూపాయల చొప్పున విరాళం అందిస్తానని శ్రీనివాసరాజు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజును సీఎం చంద్రబాబు అభినందించారు.

జగన్ దుష్ప్రచారం చేస్తున్నారు: పీతల సుజాత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచి... దళితులపై దమనకాండ సాగించిన వైసీపీ నేతలకు దళితుల గురించి మాట్లాడే హక్కు, అంబేద్కర్ విగ్రహాలను తాకే అర్హత లేదని టీడీపీ సీనియర్ మహిళా నేత, మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ మానసిక పరిస్థితి దిగజారిందని, ఆయన దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అంబేద్కర్ ఆశయానికి విరుద్ధంగా వైసీపీ పాలన సాగిందని విమర్శించారు. చంద్రబాబు దళితుల విద్యోన్నతి కోసం అంబేద్కర్ విదేశీ విద్యా విధానాన్ని తీసుకొచ్చారని, గత వైసీపీ ప్రభుత్వం దానిని నిలిపివేయడమే కాకుండా, ఆ పథకం పేరు మార్చి జగన్ రెడ్డి పేరు పెట్టుకున్నాడని తెలిపారు. అమరావతిలో అంబేద్కర్ స్మృతి వనం కోసం చంద్రబాబు రూ.100 కోట్లతో 30 ఎకరాల్లో మంచి ప్రాజెక్టును చేపడితే... కుట్రపూరితంగా జగన్ రెడ్డి దాన్ని అడ్డుకొని విజయవాడకు తరలించి దోచుకున్నారని విమర్శించారు. శిలాఫలకంపై ఉండాల్సిన జగన్ రెడ్డి పేరును అంబేద్కర్ పేరుకంటే పెద్దగా పెట్టారని, అది అంబేద్కర్‌ను అవమానించడం కాదా అని ప్రశ్నించారు. జగన్ రెడ్డి చర్యలకు బాధను అణుచుకోలేక అంబేద్కర్ వాదులే జగన్ పేరును తొలగించారని తెలిపారు.

ఎంఎస్‌పీపై తగ్గేదేలేదు

హర్యానా ప్రభుత్వానికి ఎస్‌కేఎం స్పష్టీకరణ

చండీగఢ్: కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ విషయంలో తగ్గేదేలేదని హర్యానా ప్రభుత్వానికి సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) స్పష్టంచేసింది. సీ2+50శాతం ఫార్ములా ఆధారంగా మద్దతు ధర కంటే తక్కువ ఇస్తే అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలను చైతన్యపరిచేలా తమ ప్రచారాన్ని సాగిస్తామని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇదే క్రమంలో ఈనెల 20న రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను నిర్ణయిస్తామని వెల్లడించింది. 24 పంటలకు సీ2+50శాతం ఫార్ములా లేకుండా ఎంఎస్‌పీని హర్యానా ముఖ్యమంత్రి నాయాబ్ సింగ్ ప్రకటించడాన్ని ఎస్‌కేఎం తీవ్రంగా ఖండించింది. ఎన్నికలో లబ్ధి కోసం కంటి తుడుపు చర్యలతో రైతులను మభ్యపెట్టాలని చూస్తున్నారని దుయ్యబట్టింది. సీ2+50శాతం కంటే తక్కువకు ఒప్పుకునేది లేదని తేల్చిచెప్పింది. హర్యానాలోని కేవలం ధాన్యం పండించిన రైతులకు జరిగిన నష్టం అంచనా రూ.3851.90 కోట్లు అని గుర్తుచేసింది. బీజేపీ ర్యాలీలో సీఎం చేసిన ఎంఎస్‌పీ ప్రకటన కేవలం ఎన్నికల్లో రైతుల ఓట్లను కొల్లగొట్టేందుకేనని దుయ్యబట్టింది. మూడు కార్పొరేట్ సాగు చట్టాలకు వ్యతిరేకంగా పోరాడిన హర్యానా రైతులు... బీజేపీ చేసిన మోసాన్ని క్షమించరని, తగిన బుద్ధి చెబుతారని ఎస్‌కేఎం హెచ్చరించింది. 'ఏ2+ఎఫ్‌ఎల్+50శాతం ఫార్ములా ఆధారంగా ఎంఎస్‌పీని ప్రకటించి, చట్టబద్ధ హామీ ఇవ్వకపోవడం కంటితుడుపు చర్య. ప్రొక్యూర్‌మెంట్‌కు చట్టబద్ధ హామీ లేనప్పుడు రైతులు తమ పంటోత్పత్తిని మధ్యవర్తుల ద్వారా కార్పొరేట్లకు, వ్యవసాయ వాణిజ్య సంస్థలకు అమ్ముకోవాలి. తద్వారా దోపిడీకి గురవుతూ తీవ్రంగా నష్టపోతున్నారు' అని పేర్కొంది. నాయాబ్ సింగ్ ప్రభుత్వ తాజా ఎంఎస్‌పీ ప్రకటనను తిరస్కరిస్తున్నట్లు తెలిపింది. ఎంఎస్‌పీ, సీ2+50శాతంతో పాటు చట్టబద్ధమైన పంట సేకరణ హామీ, రుణమాఫీ వంటి హక్కుల పరిరక్షణ కోసం రైతాంగాన్ని పోరుబాటులో సాగించేందుకు నిర్ణయాత్మక చర్యలపై ఈనెల 20న జరగబోయే సమావేశంలో నిర్ణయిస్తామని హర్యానా రాష్ట్ర ఎస్‌కేఎం పేర్కొంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని వ్యతిరేకించేందుకు, శిక్షించేందుకుగాను ప్రజలను, రైతులను చైతన్య పరిచేలా గ్రామీణ స్థాయిలో ప్రచారాన్ని సాగిస్తామని, మోదీ ప్రభుత్వం మోడలు వంచి డిమాండ్లు సాధించుకుంటామని సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటించింది.

అన్నింటా చంద్రబాబు మోసం

- సంక్షేమ పథకాల ఊసే లేదు... ఆరోగ్యశ్రీ అటకెక్కింది
- ఉత్తరాంధ్ర వైసీపీ నేతల సమీక్షలో జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రతి అడుగులోనూ చంద్రబాబు ప్రజలను మోసగించారని, ప్రలోభాలు, కొనుగోలు ఆయన నైజమని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మాడుగుల, అనకాపల్లి, చోడవరం నియోజకవర్గాలకు చెందిన ఎంపీటీసీ, జడ్పీటీసీలతో జగన్ సమావేశమయ్యారు. తొలుత పార్టీ నేతలతో కలిసి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి జగన్ నివాళులర్పించారు. ఎన్నికల్లో చంద్రబాబు ఎన్నెన్నో ఆశలు చూపి, ఆ తర్వాత ప్రజలను మోసగించారని జగన్ ఆరోపించారు. మన ప్రభుత్వ హయాంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ... ఏనాడూ సాకులు చూపలేదన్నారు. మాట తప్పకుండా మేనిఫెస్టో అమలు చేశామని, ఈ సమయానికి జగన్ ఉండి ఉంటే... రైతు భరోసా ఉండేదని, పాఠశాలలకు వెళ్తున్న ప్రతి విద్యార్థి తల్లులకు అమ్మఒడి అందేదని, సున్నా వడ్డీ వచ్చేదని చెప్పారు. విద్యా దీవెన కింద ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన వచ్చేదని వివరించారు. మత్స్యకార భరోసా, వాహన మిత్ర ఇచ్చేవారమన్నారు. ఆగస్టులోగా యేటా ఇవన్నీ వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేశామన్నారు. ఇప్పుడు మళ్లీ జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి వచ్చిందని, రైతులకు ఉచిత బీమా పంటల ప్రీమియం కట్టడం లేదన్నారు. 2023-24కు సంబంధించి ఏప్రిల్, మేలో ప్రీమియాన్ని తమ ప్రభుత్వ హయాంలో చెల్లించేవాళ్లమని, జూన్‌లో బీమా డబ్బులు, రైతు భరోసా డబ్బులు ఇచ్చేవాళ్లమని గుర్తుచేశారు. ఆ సమయంలో ఇవ్వడం వల్ల పెట్టుబడులకు రైతులకు సహాయంగా ఉండేదని, ఇప్పుడు అదే పోయిందని, అన్నింటా రైతులను చంద్రబాబు దగా చేస్తున్నారని చెప్పారు. పాఠశాలల్లో టోఫెల్ పీరియడ్ తీసేశారని విమర్శించారు. విద్యా కానుక పంపిణీ అస్తవ్యస్తంగా మారిందని, ట్యాబులు ఇస్తారన్న నమ్మకం తమకు లేదని, మధ్యాహ్న భోజనంలో ప్రతిరోజూ ఇచ్చే మెనూ ఆగిపోయిందని తెలిపారు. ఇంగ్లీషు మీడియం చదువులు అటకెక్కే పరిస్థితి ఉందని, ఆరోగ్యశ్రీ కింద ఒక్క పైసా ఇవ్వలేదని, ఇప్పటికే రూ.1600 కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని, రెడ్‌బుక్ పాలన కొనసాగుతోందన్నారు. కక్షలు తీర్చుకునేలా చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. మోసాలకు, అబద్ధాలకు చంద్రబాబు, టీడీపీ నేతలు అలవాటు పడ్డారని మండిపడ్డారు. కష్టాలు ఎప్పుడూ ఉండబోవని, చీకటి తర్వాత వెలుగు వస్తుందన్నారు. ఇందుకు తన పరిస్థితులే కారణమని, 16 నెలలు జైల్లో పెట్టారని గుర్తుచేశారు. ఈ ఐదేళ్లు త్వరలోనే ముగుస్తాయని, తిరిగి మనమే అధికారంలోకి వస్తామని, విలువలు, విశ్వసనీయతమీదే రాజకీయాలు చేస్తున్నామని చెప్పారు. సమావేశానికి ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు బూడిగ ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, కన్నబాబు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు హాజరయ్యారు.

విలేకరుల అక్రమ అరెస్టుపై సుక్మాలో కాంగ్రెస్ నిరసన

విశాలాంధ్ర- చింతూరు: గంజాయి కలిగి ఉన్నారన్న ఆరోపణలపై చత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా రిపోర్టర్లను చింతూరు పోలీసులు రెండు రోజుల క్రితం అరెస్టు చేశారు. ఇందుకు నిరసనగా సుక్మా జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ చైర్మన్ కొవ్వసి హరీష్ అధ్వర్యాన ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సహాయ్ ల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. విలేకరుల పట్ల చత్తీస్‌గఢ్, ఆంధ్ర పోలీసులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని హరీష్ ఆరోపించారు.

ఎమ్మెల్సీ ఉపఎన్నికకు టీడీపీ దూరం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు దూరంగా ఉండాలని టీడీపీ నిర్ణయం తీసుకుంది. వైసీపీ అభ్యర్థిగా స్థానికేతరుడైన విజయనగరం జిల్లాకు చెందిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పోటీ చేస్తున్నందున... పోటీగా అభ్యర్థిని నిలబెట్టాలని ఉమ్మడి విశాఖకు చెందిన టీడీపీ నేతలు పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకువచ్చారు. అయితే గెలుపుకు అవసరమైన మేర టీడీపీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో వైసీపీ నేతలను ప్రలోభాలకు గురి చేశారన్న అపవాదు వస్తుందని భావించి పోటీ చేయకూడదన్న నిర్ణయానికి టీడీపీ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కూటమి నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఆయన నిర్ణయానికి నేతలు ఆమోదం తెలిపారు. కాగా, ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ గడువు మంగళవారంతో ముగిసింది. వైసీపీ నుండి బొత్స సత్యనారాయణ పోటీ చేస్తుండగా, స్వతంత్ర అభ్యర్థిగా షేక్ షఫీ ఉల్లా నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఆగస్టు 16 వరకూ ఉపసంహరణకు గడువు ఉంది.

జోగి రమేశ్ పాత్ర ఉంటే..కేసు పెడతాం: ఏసీబీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అగ్రిగోల్డ్ భూముల అక్రమ లావాదేవీలకు సంబంధించి మాజీ మంత్రి జోగి రమేశ్ పాత్రపై విచారణ జరుగుతోందని, ఆయన ప్రమేయంపై నిర్ధారణ జరిగితే కేసు నమోదు చేస్తామని ఏసీబీ అడిషనల్ ఎస్పీ సౌమ్యలత వెల్లడించారు. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారం అంతా కుట్ర ప్రకారమే జరిగిందన్నారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... ఈ కేసులో జోగి రాజీవ్, మండల సర్వేయర్ రమేశ్‌లను అరెస్టు చేశామన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్నాయని, ఆ భూముల సర్వే నంబరును మార్చారని తెలిపారు. సీఐడీ అధికారులు నివేదికలు రప్పించుకున్నారని, పీసీ యాక్ట్ కింద కేసులు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ అధికారులు సైతం ఈ కేసులో దోషులుగా ఉన్నారని, అందుకే తమ విచారణ వేరుగా కొనసాగిస్తున్నట్లు వివరించారు. సీఐడీ, ఏసీబీ అధికారుల విచారణ నివేదికలపై ఉన్నతాధికారులకు వివరిస్తామని చెప్పారు. ఇప్పటివరకు తమ దర్యాప్తులో ఐదుగురు పేర్లు ఉన్నాయని, విచారణలో భాగంగా మరికొన్ని పేర్లు చేర్చే అవకాశముందని చెప్పారు. 87 సర్వే నంబరులో ఎలాంటి సబ్ డివిజన్లు జరగలేదని, అవ్వా శేష నారాయణ ఫిర్యాదు మేరకు విచారణ ప్రారంభించామని, అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగా యని తేలాకనే కేసు నమోదు చేసినట్లు ఆమె స్పష్టంచేశారు. గ్రామ, మండల సర్వేయర్లను మోసగించారని, ఇదంతా కుట్ర ప్రకారమే జరిగిందన్నారు.

కైలాశ్ గెహ్లాత్ చేతుల మీదుగా జెండావిష్కరణ

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీ ప్రభుత్వం నిర్వహించే జాతీయ జెండా ఆవిష్కరణకు సంబంధించిన వివాదానికి ముగింపు లభించింది. ఢిల్లీలో జాతీయ పతాకావిష్కరణ కోసం హోంమంత్రి కైలాశ్ గెహ్లాత్‌ను లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా నామినేట్ చేశారు. ఈ మేరకు రాజ్‌నివాస్ మంగళవారం తెలిపింది. 'ఛాత్రసాల్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో జాతీయ పతాకావిష్కరణ కోసం హోంమంత్రి కైలాశ్ గెహ్లాత్‌ను ఎంపిక చేస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ సంతృప్తి వ్యక్తంచేశారు. అందుకోసం తగు ఏర్పాటు చేయాలి' అని సీఎస్ నరేశ్ కుమార్‌కు ఎల్‌జీ కార్యదర్శి ఆశీశ్ కుంద్రా సూచించారు. విద్యామంత్రి అతిశీ ద్వారా పతాకావిష్కరణ కోసం మంత్రి గోపాల్ రాయ్ అంతకుముందు చేసిన ప్రతిపాదనను ఢిల్లీ ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగం తిరస్కరించింది. కాగా, అనేక మంది సీనియర్‌లను కాదని కైలాశ్ గెహ్లాత్‌ను ఎంపిక చేయడం ఆప్‌కు, ఎల్‌జీకి మధ్య మరో వివాదానికి కారణమైంది.

త్వరలో అక్రమార్కుల అరెస్ట్: మంత్రి నాదెండ్ల

విశాలాంధ్ర బ్యూరో-కాకినాడ: రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన కాకినాడ పోర్టు ఎగుమతుల వ్యవహారం త్వరలో ఓ కొలిక్కి కానుంది. అక్రమార్కుల ఆట కట్టించి పోర్టు కార్యకలాపాలు సక్రమంగా నిర్వహించే విధంగా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. రేషన్ బియ్యం అక్రమ రవాణా కాకినాడ పోర్టు ద్వారా జరిగిందని, ఈ వ్యవహారంలో త్వరలో అరెస్టులుంటాయని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఆయన ఉభయ గోదావరి జిల్లాల పర్యటనలో భాగంగా మంగళవారం కాకినాడలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పౌరసరఫరాలశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ విలేకరులతో మాట్లాడుతూ త్వరలోనే 41ఏ నిబంధన కింద నోటీసులు ఇచ్చి రేషన్ బియ్యం అక్రమ తరలింపుదారులను అరెస్టు చేస్తామన్నారు. ఇప్పటికే 6ఏ కింద నోటీసులు ఇచ్చి క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. కాకినాడ పోర్టును రేషన్ బియ్యం అక్రమాలకు అడ్డాగా మార్చుకున్నారని, గత ప్రభుత్వంలో భారీగా రేషన్ బియ్యం అక్రమ తరలింపు జరిగిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారమంతా ఒకే కుటుంబం కనుసన్నల్లోనే నడిచిందని మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), పౌర సరఫరాలశాఖ అధికారులు పాల్గొన్నారు.

'వక్ఫ్' జేపీసీ చైర్మన్ జగదాంబికాపాల్

న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లు-2024ను విపక్ష ఇండియా ఐక్య సంఘటన తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కు తగ్గిన మోదీ సర్కారు... బిల్లు అధ్యయనానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేసిన సంగతి విదితమే. దీనికి బీజేపీ సీనియర్ నేత జగదంబికా పాల్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా 31మంది సభ్యుల కమిటీకి పాల్‌ను చైర్మన్‌గా నియమించారు. జేపీసీ చైర్మన్‌గా ఎంపికైన జగదాంబికా పాల్ (73) ఉత్తరప్రదేశ్ నుంచి నాలుగోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు ఆగస్టు 8వ తేదీన ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టగా... ప్రతిపాదిత సవరణలపై స్వల్ప చర్చ జరిగింది. ప్రతిపక్షాల తీవ్ర నిరసనల నడుమ బిల్లుపై అధ్యయనానికి 31 మంది సభ్యులతో సంయుక్త పార్లమెంటరీ కమి టీని ఏర్పాటు చేశారు. వచ్చే శీతాకాల సమావేశాల తొలివారం చివరి రోజు నివేదిక అందించాలని గడువు విధించారు. కమిటీలో 21 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులకు చోటు కల్పించారు.

జేపీసీలో లోక్‌సభ సభ్యులు వీరే...: లోక్‌సభ నుంచి జేపీసీలో 12 మంది సభ్యులు ఎన్డీయేకు చెందిన వారుండగా... వారిలో 8 మంది బీజేపీకి చెందినవారే. 9 మంది విపక్ష సభ్యులకు జేపీసీలో చోటు కల్పించారు. జేపీసీ లోక్‌సభ సభ్యుల్లో జగదాంబికా పాల్ (చైర్మన్), నిషాకాంత్ దూబే, తేజస్వి సూర్య, అపరాజిత సారంగి, అభిజిత్ గంగోపాధ్యాయ్, సంజయ్ జైశ్వాల్, దిలీప్ సైకియా, డీకే అరుణ ఉండగా... వీరంతా బీజేపీకి చెందినవారు. కాంగ్రెస్ సభ్యుల్లో గౌరవ్ గొగోయ్, ఇమ్రాన్ మసూద్, మొహమ్మద్ జావెద్ ఉండగా, కల్యాణ్ బెనర్జీ (టీఎంసీ), ఎ.రాజా (డీఎంకే), లావు శ్రీ కృష్ణ దేవరాయలు (టీడీపీ), దిలేశ్వర్ కమైత్ (జేడీయూ), అరవింద్ సావత్ (శివసేన-యూబీటీ), సురేష్ మెహత్రె (ఎన్సీపీ శరద్ పవార్), నరేష్ మహస్కే (శివసేన), అరుణ్ భారతి (ఎల్‌జేపీ-రామ్ విలాస్), అసదుద్దీన్ ఒవైసీ (ఏఐఎంఐఎం) ఇతర సభ్యులుగా ఉన్నారు.

రాజ్యసభ సభ్యులు...: రాజ్యసభ నుంచి జేపీసీలో బీజేపీ నుంచి నలుగురు, విపక్షాల నుంచి నలుగురు, ఒక నామినేటెడ్ సభ్యుడు ఉన్నారు. బ్రిజ్ లాల్, మేధా విక్రమ్ కులకర్ణి, గులాం అలీ, రాధా మోహన్ దాస్ అగర్వాల్ (వీరంతా బీజేపీ), సైయద్ నసీర్ హుస్సేన్ (కాంగ్రెస్), మొహమ్మద్ నదీముల్ హఖ్ (టీఎంసీ), వి.విజయసాయి రెడ్డి (వైఎస్‌ఆర్సీపీ), ఎం.మొహమ్మద్ అబ్దుల్లా (డీఎంకే), సంజయ్ సింగ్ (ఆప్), వీరేంద్ర హెగ్డే నామినేటెడ్ సభ్యుడుగా ఉన్నారు.

నారాయణ వైద్య కళాశాలను మూసివేయాలి: జాన్సన్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నెల్లూరు జిల్లా నారాయణ వైద్య కళాశాలలో ర్యాగింగ్ భూతం కారణంగా మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై ఆ కళాశాలను తక్షణమే మూసి వేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై.జాన్సన్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, విద్యార్థి ప్రదీప్ ఆత్మహత్యను గోప్యంగా ఉంచి, యాజమాన్యం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. కళాశాలలో ఏమి జరుగుతున్నదనేది చూడాల్సిన బాధ్యత కళాశాల యాజమాన్యంపై ఉంటుందన్నారు. విద్యార్థులను, తల్లిదండ్రులను ర్యాంకులు, మెడికల్ సీటుతో మోసగిస్తూ, పాఠశాల స్థాయి నుంచి ఇంటర్, ఇంజినీరింగ్, వైద్య కళాశాల వరకు వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని, కనీసం మౌలిక సదుపాయాలు కల్పించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. ఈ సంఘటనపై ఉన్నత విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని, ర్యాగింగ్ పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జ్యుడీషియల్ విచారణ చేపట్టాలి : ఏపీ పేరెంట్స్ అసోసియేషన్

నారాయణ వైద్య కళాశాలలో ర్యాగింగ్ వల్ల విద్యార్థి మృతి చెందిన సంఘటనపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని, బాధ్యులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శిఖరం నరహరి, కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ నేతలు ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఈ సంఘటనలో వాస్తవాలను వెలుగులోకి తేవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. గత ఏడాది ఇదే కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడ్డారని గుర్తుచేశారు. ఈ విద్యాసంస్థలకు చెందిన పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి ఆత్మహత్యకు చేరుకున్నారని, తాజాగా వైద్య కళాశాల విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడటం తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోందని తెలిపారు.

ర్యాగింగ్‌పై కఠిన చర్యలు

వీఐటీలో యాంటీ ర్యాగింగ్ సదస్సులో ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విద్యాసంస్థల్లో లోపలా, వెలుపలా ర్యాగింగ్ పూర్తిగా నిషేధమని, చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ హెచ్చరించారు. వీఐటీ -ఏపీ విశ్వవిద్యాలయంలో మంగళవారం యాంటీ ర్యాగింగ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఏపీ ర్యాగింగ్ నిషేధ చట్టం, 1997 ప్రకారం ఏ విద్యా సంస్థ లోపల లేదా వెలుపలా ర్యాగింగ్ చేయరాదన్నారు. విద్యార్థులు ఆకతాయిగా జూనియర్లను ఆటపట్టించేందుకు ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారని, అటువంటివారిపై బాధితులు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల నుండి సస్పెండ్ గురవుతారని, తీవ్రతను బట్టి తొలగింపునకు గురవుతారని హెచ్చరించారు. అందువల్ల విద్యార్థులంతా ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, జూనియర్లకు సీనియర్లు స్ఫూర్తిగా, అండగా నిలవాలని సూచించారు. వీఐటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి మాట్లాడుతూ ఈతరం విద్యార్థులు సరైన విషయాల కోసం సమయాన్ని వెచ్చిస్తే మరింత సామర్థ్యం కలిగి ఉంటారని, నైపుణ్యాలను మరింత మెరుగైన రీతిలో ఉపయోగించుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చని ఉద్బోధించారు. రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్ చంద్ర ముదిగంటి విద్యార్థుల చేత యాంటీ ర్యాగింగ్‌పై ప్రతిజ్ఞ చేయించారు. డా.ఖదీర్ పాషా (డిప్యూటీ డైరెక్టర్ -స్టూడెంట్ వెల్ఫేర్) డా.రాఖీ (అసిస్టెంట్ డైరెక్టర్, మెంటార్), డా.మానస్ కుమార్ పాల్ (అసిస్టెంట్ డైరెక్టర్, స్టూడెంట్ వెల్ఫేర్), డా.కృష్ణసామి (అసిస్టెంట్ డైరెక్టర్, స్టూడెంట్ వెల్ఫేర్), విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినయ్ మోహన్ క్వాత్రా బాధ్యతల స్వీకరణ

వాషింగ్టన్: అమెరికాలో భారత నూతన రాయబారిగా వినయ్ మోహన్ క్వాత్రా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన భారత విదేశాంగ శాఖ కార్యదర్శిగా పనిచేశారు. ఈ ఏడాది ప్రారంభంలో పదవీవిరమణ చేసిన తరణ్‌జీత్ సింగ్ సంధు స్థానంలో వినయ్ మోహన్ బాధ్యతలు చేపట్టారు. తరణ్‌జీత్ సింగ్ సంధు అమెరికా రాయబారిగా 2020 నుండి 2024 వరకు ఉన్నారు. అమెరికాలో భారత నూతన రాయబారిగా వినయ్ మోహన్ క్వాత్రాకు స్వాగతం పలకడం ఆనందగా ఉందని చార్జ్ డి అఫైర్స్ శ్రీప్రియ రంగనాథన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో పనిచేయడానికి మేమంతా ఉత్సాహంగా ఉన్నామని అన్నారు. వినయ్ మోహన్ క్వాత్రా తన అధికారిక పత్రాలను అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు సమర్పించనున్నారు. 1988 బ్యాచ్‌కి చెందిన ఇండియన్ ఫారెన్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్) అధికారి క్వాత్రా ఫ్రాన్స్, నేపాల్‌లోనూ భారత రాయబారిగా పనిచేశారు. ఆ తర్వాత విదేశాంగ కార్యదర్శిగా నియమితులయ్యారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.